Place your advertisements on website

https://rajadhanivartalu.com
call us at whatsapp

94406 62699

# రాజధాని వార్తలు

# RAJADHANI VARTALU

ఏపి రాజధాని అమరావతి రైతులు ఇప్పటికీ ప్రభుత్వం నుండి తమ వార్షిక కౌలు చెల్లింపుల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం వారి వార్షిక కౌలు వీలైనంత త్వరగా చెల్లిస్తుందని ఆశిస్తున్నాను. ప్రభుత్వం మరింత ఆలస్యం చేస్తే అవి సరైన పద్ధతి కానే కాదు- పి.హుస్సేన్ ఖాన్, ఎం.ఎస్.సి. ఎడిటర్, రాజధాని వార్తలు

rajadhanivartalu@gmail.com
94406 62699

అమరావతి సంపుటి (Vol) : 7 సంచిక (Issue): 113 పేజీలు (Pages): 8 వెల: రూ. 2.00 ఆంధ్రప్రదేశ్ 'రాజధాని' తొలి తెలుగు దినపత్రిక (Andhra Pradesh Capital's First Telugu Daily)

శుక్రవారం, 7 - 11 - 2025

94406 62699 rajadhanivartalu rajadhaniv www.rajadhanivartalu.com RNI No.: APTEL/2019/77985 Postal regd: GTR/114/2025-27 స్థాపితం: 2015

## భారీ ఎన్‌కౌంటర్.. మరో నలుగురు మావోయిస్టులు మృతి



**ఇంటర్నెట్ డెస్క్:** ఛత్తీస్‌గఢ్ ఎన్‌కౌంటర్‌లో మరో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. బీజాపూర్ జిల్లా తార్లగూడెం పరిధిలోని మరికెళ్ల అడవుల్లో పోలీసులు, మావోయిస్టుల మధ్య ఎదురు కాల్పులు జరిగాయి. మద్దేడు ఏరియా కమిటీకి చెందిన మావోయిస్టులు ఉన్నారనే పోలీసులకు సమాచారం అందింది. దీంతో తాళ్లగూడెం పోలీస్ స్టేషన్ పరిధిలోని అన్నారం-మరికెళ్ల అడవుల్లో భద్రతా బలగాలు ఆపరేషన్ చేపట్టాయి. ప్రస్తుతం భీకర ఎదురు కాల్పులు సాగుతున్నాయి. బుధవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మరణించారు. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'ఆపరేషన్ కగార్'తో భారత భద్రతా దళాలు మావోస్టులను మట్టుబెడుతున్న సంగతి తెలిసిందే.

## ఎవరైనా డ్రగ్స్ సరఫరా చేశారో.. పట్టాభి వార్నింగ్

**విశాఖపట్నం, (రాజధాని వార్తలు):** వైసీపీపై స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ ఛైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ కీలక వ్యాఖ్యలు చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ.. జగన్ హయాంలో విశాఖను డ్రగ్స్ అడ్డాగా మార్చారని ఆరోపించారు. వైసీపీ హయాంలో గంజాయి కంటైనర్, పెద్ద ఎత్తున గంజాయి దొరికేవన్నారు. వైసీపీ నేతల అరాచకాలు ఆగడం లేదని... విశాఖలో వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొండా రెడ్డి డ్రగ్స్‌తో పట్టుబడ్డారని అన్నారు. వైసీపీ యువజన విభాగం డ్రగ్స్ ముఠాగా మారిందని.. రెడ్ హ్యాండెడ్‌గా కొండా రెడ్డి దొరికారంటూ వ్యాఖ్యలు చేశారు. కొండారెడ్డి దొరకగానే వైసీపీ నేతలు ఏవేవో మాట్లాడుతున్నారని విమర్శించారు. ఇప్పటి వరకు కొండారెడ్డిపై జగన్ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. ఈ విషయంలో గుడివాడ అమర్నాథ్ కూడా స్పందించాలని డిమాండ్ చేశారు. వైసీపీ నేతలు రేవ్ పార్టీ చేసుకున్నట్లు సమాచారం వచ్చిందని... విచారణ జరిపిస్తామని అన్నారు. వైసీపీ నేతలు యువతకు డ్రగ్స్ సరఫరా చేసి.. రప్పా రప్పా రాజకీయాలు చేయాలని అనుకుంటారా అంటూ ఫైర్ అయ్యారు. డ్రగ్స్‌పై కూటమి ప్రభుత్వం కఠినంగా వ్యవహరిస్తుందని.. ఉక్కు పాదం మోపుతామని హెచ్చరించారు. విశాఖలో కానీ, ఎక్కడైనా సరే.. ఎవరైనా డ్రగ్స్ సరఫరా చేస్తే కఠిన చర్యలు తప్పవని వార్నింగ్ ఇచ్చారు. విశాఖకు గూగుల్ డేటా సెంటర్ వచ్చిందంటే అంతా చంద్రబాబు కృషి వలనే అని అన్నారు. డేటాకి మైండ్ అప్లై చేస్తే... ఏఐ అని జగన్ అంటారా? ఆయన ఏం మాట్లాడుతున్నారో ఆయనకే తెలియట్లేదు అంటూ ఎద్దేవా చేశారు. మొదట గూగుల్ సెంటర్‌ను



వైసీపీ నేతలు వ్యతిరేకించారని.. అందరూ ఉమ్ము వేస్తే ఇప్పుడు సమర్థిస్తున్నారని పట్టాభి వ్యాఖ్యలు చేశారు.

**పెట్టుబడుల సదస్సుపై...**

పెట్టుబడులు పెట్టడానికి పారిశ్రామికవేత్తలు విశాఖకు వస్తున్నారని పట్టాభి అన్నారు. విశాఖలో 14, 15 తేదీల్లో సీఐఐ భాగస్వామ్య సదస్సు ఏర్పాట్లను సమీక్షించామని తెలిపారు. ఈ సమ్మిట్‌ను విజయవంతం చేయడానికి జీవీఎంసీ అద్భుతంగా పనిచేస్తోందని.. మేయర్ పీలా శ్రీనివాసరావును అభినందిస్తున్నామన్నారు. అంతర్జాతీయ స్థాయిలో ఈ సదస్సును నిర్వహిస్తున్నామని.. మూడు వేల మందికిపైగా ప్రతినిధులు వస్తారని చెప్పారు. పది లక్షల కోట్ల ఒప్పందాలు జరుగుతాయని.. ఏడున్నర లక్షల ఉద్యోగాలు వస్తాయని ధీమా వ్యక్తం చేశారు. ఈ సదస్సు ద్వారా జోరో వెస్ట్ కాన్సెప్ట్‌కు శ్రీకారం చుట్టబోతున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో ఎక్కడా ప్లాస్టిక్ లేకుండా చూస్తున్నామని.. క్లే బాటిల్స్‌ను ఉపయోగిస్తున్నామని కొమ్మారెడ్డి పట్టాభి వెల్లడించారు.

## ప్రభుత్వ విద్యాలయాల్లో పరిపాలనపై మంత్రి ఆదేశాలు





**అమరావతి, (రాజధాని వార్తలు):** గవర్నమెంట్ యూనివర్సిటీల్లో పరిపాలనకు సంబంధించి యూనిఫైడ్ యాక్ట్ రూపొందించాలని సంబంధిత అధికారులను మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఉన్నత విద్య, ఇంటర్మీడియట్ విద్యపై అధికారులతో గుంటూరు జిల్లా ఉండవల్లి నివాసంలో మంత్రి సమీక్ష నిర్వహించి మాట్లాడారు. కళాశాలల్లో నాలుగేళ్ల పాటు ఇంజనీరింగ్ చదువుతున్న విద్యార్థులకు ఉద్యోగాలు లభించడం లేదన్నారు. అమీర్ పేటలో నాలుగు నెలల కోచింగ్‌తో విద్యార్థులు ఉద్యోగాలు సాధిస్తున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో ఉన్నత విద్య పాఠ్యప్రణాళికను ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఐటిఐలు, యూనివర్సిటీలను నవంబర్‌లోగా పరిశ్రమలతో అనుసంధానానికి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రైవేటు కాలేజీలను కూడా నైపుణ్యం పోర్టల్‌తో అనుసంధానం చేసి ప్రాంగణ నియామకాలకు గ్యారంటీ ఇవ్వాలని, కళాశాలల్లో తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. కేజీ నుంచి పీజీ వరకు స్టూడెంట్ ట్రాకింగ్ వ్యవస్థను సమర్థంగా రూపొందించాలని, ఎన్ఐ ఆర్ఎఫ్ ర్యాకింగ్స్ మెరుగుదలకు చర్యలు చేపట్టాలని మంత్రి సూచించారు. యూనివర్సిటీల్లో ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టుల భర్తీపైనా సమావేశంలో చర్చించారు. యూనివర్సిటీలు, ఐటిఐ, ట్రిపుల్ ఐటీల్లో ప్రాంగణ నియామకాలపై ఈ సందర్భంగా మంత్రి ఆరా తీశారు. విద్యార్థుల వంద శాతం ప్రాంగణ నియామకాలకు చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు. అన్ని యూని వర్సిటీల్లో స్టూటెండ్ ఫీడ్ బ్యాక్ మెకానిజం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణతా శాతం పెంపునకు చర్యలు చేపట్టాలని అధికారులను మంత్రి నారా లోకేష్ ఆదేశించారు. ఇంటర్ విద్యపై ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. ఇంటర్‌లో చేపట్టిన సంస్కరణలను ఈ సందర్భంగా అధికారులు మంత్రికి వివరించారు. వృత్తి విద్య కోర్సులను అభ్యసిస్తున్న విద్యార్థులను ట్రాకింగ్ చేయాలని లోకేష్ ఆదేశించారు. ప్రైవేటు కాలేజీలకు అనుమతులపై కాలపరిమితి ఉండాలన్నారు.

## ఆర్టీసీ బస్సులో మంటలు.. ప్రయాణికులు సేఫ్

**పార్వతీపురంమన్యం, (రాజధాని వార్తలు):** తెలుగు రాష్ట్రాల్లో వరుసగా జరుగుతున్న బస్సు ప్రమాదాలతో ప్రయాణికులు భయాందోళనకు గురవుతున్నారు. ఇటీవల ఏపీలోని కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు దగ్ధం ఘటన తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటనలో చాలా మంది ప్రాణాలు కోల్పోయారు. ఈ దుర్ఘటనను మరువక ముందే రాష్ట్రంలోని పలుచోట్ల బస్సు ప్రమాదాలు జరిగాయి. కానీ ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇప్పుడు తాజాగా పార్వతీపురం మన్యం జిల్లాలో మరో బస్సు ప్రమాదం జరిగింది. నడిరోడ్డుపై ఒడిశాకు చెందిన ఆర్టీసీ బస్సు మంటల్లో కాలిబూడిదైంది. జిల్లాలోని పాచిపెంట మండలం రొడ్డవలస సమీపంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. విశాఖపట్నం నుంచి జైపూర్ వెళుతున్న ఒడిశా ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురైంది. ఆంధ్రా-ఒడిశా సరిహద్దులో బస్సులో ఒక్కసారిగా మం టలు చెలరేగాయి. వెంటనే గుర్తించిన డ్రైవర్ ప్రయాణికులను అలర్ట్ చేశాడు. బస్సంతా మంటలు వ్యాపించక ముందే ప్రయాణికులు అప్రమత్తమై కిందకు దిగి ప్రాణాలు కాపాడుకున్నారు. ఆ తరువాత మంటల్లో బస్సు పూర్తిగా దగ్ధమైంది. సమాచారం అందిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అనంతరం ప్రయాణికులు వివిధ వాహనాల్లో తాము చేరాల్సిన గమ్యస్థానాలకు బయలుదేరి వెళ్లిపోయారు. కాగా.. ఆర్టీసీ బస్సు దగ్ధంపై మంత్రులు అచ్చెన్నాయుడు, సంధ్యారాణి స్పందించారు. ప్రమాదానికి గల కారణాలపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. ఘటనపై విచారణ జరిపి ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాల్సిందిగా మంత్రి సంధ్యారాణి అధికారులను ఆదేశించారు. అలాగే ప్రమాదంపై ఎస్పీతో మాట్లాడిన మంత్రి అచ్చెన్నాయుడు.. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరుగకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశాలు జారీ చేశారు.

## డేటా ఆధారిత పాలన అత్యంత కీలకం : సీఎం చంద్రబాబు



**అమరావతి, (రాజధాని వార్తలు):** డేటా డ్రివెన్ గవర్నెన్స్‌పై సీఎం చంద్రబాబు నాయుడు గురువారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. దీర్ఘకాలిక, మధ్యకాలిక, స్వల్పకాలిక లక్ష్యాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించుకుని పౌరులకు సుపరిపాలన అందించాలని అన్నారు. అదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని.. దానికి అనుగుణంగానే విజన్ ప్రణాళికలను రూపొందించామని వెల్లడించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించాలన్నదే లక్ష్యం కావాలని సూచించారు. గ్రామ సచివాలయాన్ని విజన్ యూనిట్‌గా మార్చుకుని సమర్థంగా ఆ విభాగాన్ని వినియోగించుకుందామని అధికారులకు తెలిపారు. అంతా కలిసి కట్టుగా పనిచేసి ఇటీవల వచ్చిన తుఫానును టెక్నాలజీ వినియోగంతో ప్రాణ, ఆస్తి నష్టాన్ని బాగా తగ్గించగలిగామని సీఎం అన్నారు. రాష్ట్రస్థాయి నుంచి క్షేత్రస్థాయి వరకూ ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేసి ప్రాణ, ఆస్తి నష్టాన్ని నివారించగలిగామ న్నారు. డేటా ఆధారిత పాలన అనేది ఇప్పుడు అత్యంత కీలకమైన అంశంగా మారిందని చెప్పుకొచ్చారు. క్వాంటం కంప్యూటర్‌ను వచ్చే జనవరి నుంచే అమరావతిలో ప్రారంభించబోతున్నామని తెలిపారు. సీఎఫ్ఎంఎస్ వ్యవస్థ ద్వారా సమర్థంగా వనరుల్ని వినియోగించగలుగుతున్నామని అన్నారు. గత ప్రభుత్వ చేసిన విధ్వంసాన్ని చక్కదిద్దుతూ ఉన్న సమస్యల్ని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తున్నామని సీఎం తెలిపారు.

**వేగంగా నిర్ణయాలు...**

2047 విజన్ డాక్యుమెంట్ లక్ష్యాలకు అనుగుణంగా అధికారులు పనిచేయాలని కోరుతున్నామని అన్నారు. నెలవారీ, త్రైమాసిక లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని ఫలితాలను సాధించాలని సూచించారు. నిర్దిష్ట ప్రమాణాలకు అనుగుణంగానే ప్రభుత్వం పౌరసేవలు అందిం చాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ప్రతీ నియోజకవర్గానికి ఓ సీనియర్ అధికారి నేతృత్వంలో టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేసి విజన్ ప్లాన్ అమలు చేస్తామన్నారు. ఆర్టీజీఎస్ ద్వారా సేకరించిన సమాచారాన్ని విశ్లేషించి ఆయా శాఖలకు అప్పగిస్తున్నామని.. దానికి అనుగుణంగానే నిర్ణయాలు వేగంగా తీసుకోవాల్సి ఉంటుందని ముఖ్య మంత్రి వెల్లడించారు.

**రియల్ టైమ్ గవర్నెన్స్ కాలం...**

ప్రస్తుతం రియల్ టైమ్ గవర్నెన్స్ కాలం నడుస్తోందని.. సిటిజెన్ డేటా అంతా క్రోడీకరించామని సీఎం తెలిపారు. అంగన్‌వాడీల స్థాయి నుంచే విద్యార్థుల డేటా అనుసంధానం కావాలని అధికారులకు సూచించారు. అవేర్ ద్వారా విస్తృతమైన డేటాను సమన్వయం చేసుకుని వేగంగా నిర్ణయాలు తీసుకోవాలని తెలిపారు. డేటా లేక్ ద్వారా అన్ని ప్రభుత్వ శాఖలకు చెందిన సమాచారం ఒక్క చోటే క్రోడీకరించి నిర్ణయాలు తీసుకునే వెసులుబాటు కల్పిస్తున్నామని వెల్లడించారు. ఈ డేటా ద్వారా రియల్ టైమ్‌లోనే అనలటిక్స్ చేసి వాటి ద్వారా తక్షణ నిర్ణయాలు తీసుకునేందుకు ఆస్కారం ఉందని చెప్పుకొచ్చారు. ప్రిడిక్టివ్ అనలటిక్స్‌కు కూడా టెక్నాలజీ ద్వారా సాధ్యం అవుతోందన్నారు. ప్రజల సంక్షేమం కోసం, పాలన కోసం భారీస్థాయిలో బడ్జెట్ వ్యయం చేస్తున్నామని.. నిధులు వ్యయం సమర్థంగా జరగాలని సూచనలు చేశారు.

**ఆ పరిస్థితి మారాలి...**

ప్రస్తుతం ఇ-ఫైల్స్ కూడా అందరికీ అందుబాటులో ఉన్నాయని.. ఎంత వేగంగా నిర్ణయం తీసుకుంటున్నారన్నదే ప్రశ్న అని అన్నారు. గతంలో ఒక్క చదువుకే కులం, స్థానికత, ఆదాయం ఇలా వేర్వేరు ధృవపత్రాలు 10 రోజులు ఆఫీసుల చుట్టూ తిరిగి తీసుకోవాల్సి వచ్చేదని గుర్తు చేశారు. ఈ పరిస్థితి అంతా మారిపోవాలని... కేంద్రం తీసుకొచ్చిన డీజీ లాకర్‌ను సమర్థంగా వినియోగించాలని ఆదేశించారు. అందరూ అన్ని శాఖలలోని సమాచారాన్ని తెలుసుకుని దానిని గుర్తించి పనిచేయాలని ముఖ్యమంత్రి సూచనలు చేశారు.


**ప్రజలకు చెప్పాల్సిందే...**

ఇటీవల జరిగిన బస్సు ప్రమాదాల వల్ల చాలా ప్రాణాలు పోయాయని అన్నారు. శ్రీకాకుళంలోని వెంకటేశ్వర స్వామి ఆలయంలో తొక్కిస లాట ప్రమాదం జరిగిందని.. ఒక సంఘటన తర్వాత ఆయా తప్పులు దిద్దుకోవాల్సి ఉందని అభిప్రాయపడ్డారు. ఎస్ఓపీ ఉన్నా దానిని ఎందుకు పాటించలేకపోతున్నారని ప్రశ్నించారు. పీపుల్స్ పాజిటివ్ పర్సెప్షన్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. గత పాలకుల హయాంలో ఎక్సైజ్‌లో తీవ్రమైన అవకతవకలు జరిగాయని విమర్శించారు. వాటన్నింటినీ సరిచేస్తుంటే మళ్లీ ప్రభుత్వంపైనే బ్లేమ్ గేమ్ వేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. పారదర్శకత పాటించటంతో పాటు దానిని ప్రజలకు కూడా సరిగ్గా చెప్పుకోవాలని తెలిపారు. పోలీసు విభాగానికి సంబంధించిన వివరాలు కూడా డేటా లేక్‌కు అనుసంధానం కావాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. ఈ సమీక్షలో మంత్రులు, కార్యదర్శులు, హెచ్ఓడీలు పాల్గొనగా... జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు వీడియో కాన్ఫరెన్స్ ద్వారా హాజరయ్యారు.

## రూ.1.68 లక్షల కోట్ల మహిళా పథకాలు

### - ప్రస్తుత బడ్జెట్‌లో 12 రాష్ట్రాలు చేయనున్న భారీ ఖర్చు ఇది
### - మహిళల సంక్షేమ ఖర్చే అత్యధికం..అధ్యయనంలో వెల్లడి

**న్యూఢిల్లీ:** మహిళలు కేంద్రంగా అమలు చేస్తున్న నగదు బదిలీ (యూసీటీ) పథకాలతో రాష్ట్రాల ఆర్థిక వ్యవస్థలు కుదేలవుతున్నాయని, మిగులులో ఉండే రాష్ట్రాల రెవెన్యూ కాస్తా లోటులోకి జారిపోతోందని ఓ అధ్యయనంలో తేలింది. మూడేళ్ల క్రితం రెండు రాష్ట్రాలకే పరిమితమైన ఈ తరహా పథకాల అమలు ఇప్పుడు 12 రాష్ట్రాలకు విస్తరించిందని, ప్రస్తుత బడ్జెట్‌లో ఈ రాష్ట్రాలు మొత్తం రూ. 1.68 లక్షల కోట్లు (1.68 ట్రిలియన్లు) దీనికోసం వెచ్చించనున్నాయని పీఆర్ఎస్ లెజిస్లేటివ్ రీసెర్చ్ అనే సంస్థ తన నివేదికలో వెల్లడించింది. ఈ పథకాలను అమలు చేస్తున్న వాటిలో ఆరు రాష్ట్రాలు ఈ ఏడాది రెవెన్యూలోటును నమోదు చేశాయని చెబుతూ.. పెరిగిన యూసీటీల విస్తృతి ఆర్థిక వ్యవస్థకు



పెను భారంగా మారిందనేందుకు ఇదే నిదర్శనమని వ్యాఖ్యానించింది.

## తప్పు చేస్తే ఏ పార్టీ వ్యక్తి అయినా చర్యలు తప్పవు : హోంమంత్రి

**అమరావతి, (రాజధాని వార్తలు):** వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొండారెడ్డి..ఇటీవల డ్రగ్స్ వాడుతూ ఈగల్ టీంకు పట్టుబడ్డారు. ఈ క్రమంలో వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి, కొండారెడ్డి కలిసి ఉన్న ఫోటోలను హోంమంత్రి వంగలపూడి అనిత గురువారం మీడియాకు విడుదల చేశారు. ఈ క్రమంలో వైసీపీ నేతలపై హోంమంత్రి తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. వైసీపీ నేతలు డ్రగ్స్ వ్యాపారం చేస్తున్నారంటూ మండిపడ్డారు. డ్రగ్స్, గంజాయి ఏపీలో లేకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. డ్రగ్స్ వద్దు బ్రో అని కూటమి ప్రభుత్వం అంటుంటే... వైసీపీ నేతలు డ్రగ్స్ కావాలి బ్రో అంటున్నారంటూ కామెంట్స్ చేశారు. ఈగల్ వ్యవస్థను ప్రారంభించాక యువత డ్రగ్స్ వాడకం తగ్గించిందన్నారు. విశాఖ వైసీపీ యువజన విభాగం అధ్యక్షుడు కొండారెడ్డి డ్రగ్స్ వాడుతూ ఈగల్ టీంకు దొరికిపోయారని తెలిపారు. కొండారెడ్డి యువతకు డ్రగ్స్ ఇచ్చి పాడు చేస్తుంటే జగన్ ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు.



కొండారెడ్డిని పార్టీ నుంచి జగన్ ఎందుకు సస్పెండ్ చేయలేదని నిలదీశారు. డ్రగ్స్ వాడే వాళ్లకి పార్టీలతో సంబంధం లేదన్నారు. యూనివర్సిటీ విద్యార్థులకు కొండారెడ్డి డ్రగ్స్ ఇస్తున్నాడని తెలిపారు. తప్పు చేస్తే ఏ పార్టీ వ్యక్తి అయినా చర్యలు తీసుకుంటామని హోంమంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు.

# ఈనెల 9న అల్లామా మొహమ్మద్ ఇక్బాల్ (1877-1938) 148వ జయంతి



సుప్రసిద్ధ ఉర్దూ గీతం 'సారే జహాఁసే అచ్ఛా ... హిందూస్తా హమారా'ను సృజియించిన కవి అల్లామా మొహమ్మద్ ఇక్బాల్ 1877 నవంబర్ 9న ప్రస్తుత పాకిస్థాన్‌లోని పంజాబ్ రాష్ట్రం సియాల్ కోట్‌లో జన్మించారు. తల్లి ఇమాం బీబి, తండ్రి షేక్ నూర్ అహ్మద్. సుప్రసిద్ధ పండితుల వద్ద ఇక్బాల్ ధార్మిక విద్యాభ్యాసం సాగింది. ఆ తరువాత లాహెూర్‌లో ఉన్నతవిద్య పూర్తి చేసి 1899లో తత్వశాస్త్రంలో ఎం.ఏ ఉత్తీర్ణత పొంది అధ్యాపకునిగా పనిచేశారు. ఉర్దూ కవిత్వం పట్ల మక్కువ పెంచుకున్న ఆయన స్వదేశం అనుభవిస్తున్న బానిసత్వం, స్వజనుల సమస్యలు, ధార్మిక అంశాలతోపాటుగా దేశభక్తి ప్రపూరితమైన కవిత్వం రాస్తూ మంచి కవిగా గుర్తింపు పొందారు. 1904లో ఆయన రాసిన 'సారే జహాఁసే అచ్ఛా... హిందూస్తాఁ హమారా' గీతం 1904 ఆగస్టు 16 నాటి Ittehad ఉర్దూ వారపత్రికలో ప్రచురితమై, ఆ తరువాత Tarana-e-Hindi శీర్షికతో 1923 నాటి Bang-E-Dara గ్రంథంలో చోటు చేసుకుంది. 1905లో ఉన్నతవిద్య కోసం లండన్ వెళ్ళిన ఆయన న్యాయశాస్త్రంలో డిగ్రీ చేసి, ఆ తర్వాత పిహెచ్.డి సాధించారు. 1906లో 'అఖిల భారత ముస్లిం లీగ్' లండన్ శాఖ సభ్యత్వం స్వీకరించారు. స్వదేశీ ఉద్యమాన్ని పూర్తిగా బలపర్చారు. 1908లో ఇండియా వచ్చి న్యాయవాదిగా ప్రాక్టీస్ ఆరంభించినా, ఆ వృత్తి పట్ల శ్రద్ధ చూపలేదు. ఇంగ్లాండ్ నుంచి వచ్చాక ముస్లింల సమస్యలకు ధార్మిక దృష్టి కోణంతో పరిష్కారాలు ఆలోచిస్తూ తన తాత్విక భావజాలం వ్యక్తీకరణకు ఉర్దూ కంటె పర్షియన్ ఉపయుక్తమని భావించిన ఆయన పర్షియన్‌లో కవిత్వం రాస్తూ ప్రముఖ కవిగా, ఇస్లామిక్ తత్త్వవేత్తగా గణతికెక్కారు. సర్ సయ్యద్ అహ్మద్ ప్రభావం వలన ముస్లింల విద్యపట్ల అధిక శ్రద్ధచూపిన అల్లామా మొహమ్మద్ ఇక్బాల్ రాజకీయాలలో ముస్లింలకు మార్గదర్శకం చేస్తూ ముస్లింల పేదరికం, వెనుకబాటుతనం గురించి 1926 నాటి ముస్లిం లీగ్ సమావేశంలో ప్రస్తావించారు. 1926లో పంజాబ్ లెజిస్లేటివ్ అసెంబ్లీ సభ్యులయ్యారు. అలహాబాద్‌లో 1930 నాటి 'ముస్లిం లీగ్' సమావేశం అధ్యక్షునిగా ఆయన చేసిన ప్రసంగం వివాదాస్పదమైంది. ఆయన పాకిస్థాన్ ఏర్పాటు కోరారని ఒకపక్షం, ముస్లింలు అత్యధిక సంఖ్యలో గల ప్రాంతాల ప్రత్యేక రాష్ట్రం మాత్రమే కోరారని మరోపక్షం వాదన ఆరభించగా ఈ విషయం మీద చాలా చర్చ జరిగింది. ఆయన మాత్రం 'మీరు నన్ను పాకిస్థాన్ సిద్ధాంతానికి అనుకూలుడుగా చిత్రించారు. కాని పాకిస్థాన్ నా లక్ష్యం కాదు' అన్నారు. 1931-32లో లండన్‌లో జరిగిన ద్వితీయ రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్‌కు ముస్లిం లీగ్ ప్రతినిధిగా హాజరయ్యారు. ఒకవైపు రాజకీయలలో ప్రముఖ పాత్ర నిర్వహిస్తూ, మరోవైపున కవిగా ఉర్దూ, పర్షియన్ భాషల్లో అత్యుత్తమ సాహిత్యాన్ని సృజియిస్తూ ప్రపంచ వ్యాప్తంగా ప్రశంసలను అందుకున్న ఆయన పలు గ్రంథాలు పలు ఇతర భాషల్లోకి అనువాదమయ్యాయి. చివరి రోజుల్లో తీవ్ర అనారోగ్యానికి గురైనా అల్లామా మొహమ్మద్ ఇక్బాల్ సాహితీ సృజనతోపాటు, స్వజనుల సంక్షేమం కోసం కృషి చేస్తూ 1938 ఏప్రిల్ 21న లాహెూర్‌లో అంతిమ శ్వాస విడిచారు.

- (సయ్యద్ నశీర్ అహమ్మద్ 2014లో వెలువరించిన "చరితార్థులు" గ్రంథం నుండి)

# ఎస్.ఆర్.ఎంపై విచారణ కమిటీ

**గుంటూరు, (రాజధాని వార్తలు):** ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీలో ఫూడ్ పాయిజన్ పట్ల విచారణ కమిటీని నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. కమిటీలో తెనాలి సబ్ కలెక్టర్, ఉన్నత విద్యా శాఖ జాయింట్ డైరెక్టర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి, ఆహార తనిఖీ అధికారి, మంగళగిరి సబ్ డివిజనల్ పోలీస్ అధికారి, జిల్లా పౌర సరఫరాల అధికారిని నియమించారు. ఎస్.ఆర్.ఎం యూనివర్సిటీ లో ఫూడ్ పాయిజన్ అంశాల పట్ల క్షుణ్ణంగా విచారణ చేసి నివేదిక సమర్పించాలని ఉత్తర్వుల్లో ఆదేశించారు. ఈ మేరకు కమిటీ తన పనులను ప్రారంభించింది.

# చిన్నారుల సంరక్షణ వసతి గృహాలను నిబద్ధతతో నిర్వహించాలి

**నెల్లూరు , (రాజధాని వార్తలు):** జిల్లాలో చిన్నారుల సంరక్షణ వసతి గృహాలను నిబద్ధతతో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల నిర్వాహకులకు సూచించారు. బుధవారం ఉదయం కలెక్టర్ వారి ఛాంబర్‌లో జిల్లాలోని 30 చైల్డ్ కేర్ హెూమ్స్‌కు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జువెనైల్ జస్టిస్ చట్టం 2015 ప్రకారం ప్రతి చైల్డ్ కేర్ హెూమ్‌ను అన్ని అవసరమైన వసతులతో పిల్లల భద్రత, ఆరోగ్యం, విద్య, ఆహారం, మానసిక అభివృద్ధి తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని నిబద్ధతతో నిర్వహించాలని సూచించారు. పిల్లలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వ నిబంధనల మేరకు వారి భవిష్యత్తుకు భరోసాగా నిలవాలని ఈ సందర్భంగా చైల్డ్ కేర్ హెూమ్ నిర్వాహకులకు కలెక్టర్ సూచించారు. అనంతరం "దత్తత మాసం" కార్యక్రమంలో భాగంగా దత్తతపై అవగాహన కల్పించే పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్త్రీ శిశు సంక్షేమ సాధికారత అధికారి హేనాసుజున్, జిల్లా ప్రొబేషన్ అధికారి ఫరూక్ బాషా, జిల్లా బాలల సంరక్షణ అధికారి సురేష్, సుమలత, సమత, మిషన్ వాత్సల్య సిబ్బంది, చైల్డ్ కేర్ ఇన్స్టిట్యూషన్ల ప్రతినిధులు పాల్గొన్నారు.

# "టిపి గూడూరులో కాకాణి పర్యటన"






**నెల్లూరు , (రాజధాని వార్తలు):** సర్వేపల్లి నియోజకవర్గం, తోటపల్లి గూడూరు మండలం, వెంకన్నపాళెం గ్రామంలో పర్యటించిన మాజీ మంత్రివర్యులు మరియు ఉమ్మడి నెల్లూరు జిల్లా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కాకాణి గోవర్ధన్ రెడ్డి. కూటమి ప్రభుత్వంలో అనేక ఇబ్బందులు పడుతున్నామంటూ వాపోయిన రైతులు. ఎకరాకు మూడు బస్తాలు యూరియా ఇస్తామంటూ, యూరియా కార్డులు జారీ చేస్తున్నారంటూ, యూరియా కార్డులు కాకాణికి చూపించి, ఎకరాకు మూడు బస్తాలు ఎలా సరిపోతాయంటూ గోడు వెళ్లబోసుకున్న రైతులు. కరెంటు చార్జీలు ఇబ్బడిముబ్బడిగా పెంచడంతో నష్టపోతున్నామని ఆవేదన వ్యక్తం చేసిన ఆక్వా రైతులు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్త వెంకటశేషయ్య తల్లి ఇటీవల మృతి చెందడంతో, కుటుంబ సభ్యులను పరామర్శించిన కాకాణి. కూటమి పాలనలో అన్ని వర్గాల ప్రజలతో పాటు, రైతులు మరింత అవస్థలు పడుతున్నారు. రైతులు ఎకరాకు మూడు బస్తాలు యూరియా అంటూ పరిమితులు విధించడం అన్యాయం. రైతులకు సమృద్ధిగా అవసరం మేరకు ప్రభుత్వం యూరియా అందించాల్సిందే! యూరియా పంపిణీ విషయంలో పక్షపాత వైఖరి ప్రదర్శించినా, అవకతవకలకు పాల్పడినా ఉపేక్షించం. జిల్లాలో ప్రతి రైతుకు అవసరం మేర, యూరియా అందించేందుకు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పోరాటం చేస్తుంది. ప్రభుత్వంతో, అధికారులతో పోరాడైన సరే రైతులకు సమగ్రంగా, సంపూర్ణంగా యూరియా అందించే బాధ్యత మాది. కరెంటు చార్జీలు పెరగడం, గిట్టుబాటు ధర లేకపోవడం, ఆక్వా రైతులకు తీవ్ర ఇబ్బంది కలుగుతుంది. చంద్రబాబు ఎన్నికలకు ముందు కరెంటు చార్జీలు పెంచనని హామీచ్చి, అధికారంలోకి వచ్చాక ప్రజలపై వేల కోట్ల రూపాయల విద్యుత్ ఛార్జీల భారం మోపాడు. చంద్రబాబుకు మాయ చేయడం, మాట తప్పడం తప్ప, ఎన్నడూ తాను ఇచ్చిన హామీలకు కట్టుబడి ఉండలేదు.

చంద్రబాబు సంక్షేమ కార్యక్రమాలు అమలు చేయ కుండా ప్రతినెలా పెన్షన్లు పంపిణీ చేస్తూ, సరిపెట్టుకుంటున్నాడు. కూటమి ప్రభుత్వపు అన్యాయాలు అక్రమాలు చూసిన ప్రజలం దరూ జగన్మోహన్ రెడ్డి మరలా తిరిగి ముఖ్యమంత్రి కావాలని కోరుకుంటున్నారు. సర్వేపల్లి నియోజకవర్గంలో సోమిరెడ్డి, సోమిరెడ్డి కొడుకు ప్రజల సొత్తు దోచుకోవడం తప్ప, మరో పని చేయడం లేదు. సర్వేపల్లిలో సర్వం దోపిడీ చేస్తున్న సోమిరెడ్డి, సోమిరెడ్డి కొడుకులను చూసి ప్రజలు ఛీదరించుకుంటున్నారు. సోమిరెడ్డి అభివృద్ధి చేయలేకపోయినా అవినీతిలో మాత్రం సర్వేపల్లి నియోజకవర్గాన్ని నెంబర్-1 స్థానంలో నిలబెట్టాడు. సోమిరెడ్డి అవినీతి బ్రతుకు చూసి, ఎవరు ఎన్ని రకాల విమర్శలు చేసినా, ఏమాత్రం సిగ్గు, ఎగ్గు లేకుండా, దోపిడీయే పరమావధిగా బ్రతుకుతున్నాడు. అధికారం ఉన్నా, లేకపోయినా ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ, ఎప్పుడు ఎవ్వరికీ ఏ అవసరం వచ్చినా అండగా నిలుస్తాం.

# వి.ఎస్.యూలో యాంటీ ర్యాగింగ్, సైబర్ క్రైమ్, డ్రగ్స్‌పై బృహత్ అవగాహన సదస్సు

## - "సాంకేతికతను సమాజ హితానికే వాడాలి"
## - ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు









**నెల్లూరు , (రాజధాని వార్తలు):** నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వి.ఎస్.యూ) ప్రాంగణంలో "యాంటీ ర్యాగింగ్, సైబర్ క్రైమ్ నివారణ, మరియు డ్రగ్స్ దుర్వినియోగం నియంత్రణ" అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఒక బృహత్ సదస్సును ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాస రావు ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సదస్సులో విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా. కె.సునీత, మహిళా పోలీస్ స్టేషన్ సి.ఐ. సుబ్బారావు, సి.ఐ. కృష్ణారెడ్డి, ఎ.ఎస్.ఐ. శ్రీహరి, ఎస్.ఐ. రాకేష్ పోలీస్ సిబ్బంది పాల్గొని, కీలక అంశాలపై విద్యార్థులకు దిశానిర్దేశం చేశారు.

**సమాజ శ్రేయస్సుకు విద్యార్థుల కృషి అవసరం**

ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు మాట్లాడుతూ, "విద్యార్థులు దేశ భవిష్యత్తు పౌరులు. వారు సాంకేతికతను సమాజానికి మేలు చేసే విధంగా ఉపయోగించాలి," అని పిలుపునిచ్చారు. ర్యాగింగ్, సైబర్ నేరాలు, డ్రగ్స్ వాడకం వంటి ప్రమాదకరమైన చర్యలు వ్యక్తిగత జీవితాలనే కాక, సమాజ భద్రతను కూడా దెబ్బతీస్తాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. విశ్వవిద్యాలయాలు భయానికి కాకుండా, సౌహార్ద వాతావరణానికి ప్రతీకలుగా నిలవాలని ఆయన ఆకాంక్షించారు.

**పోలీసు అధికారుల హెచ్చరికలు, సూచనలు**

సైబర్ నేరాలపై అప్రమత్తత: మహిళా పోలీస్ స్టేషన్ సి.ఐ. సుబ్బారావు మాట్లాడుతూ, "సోషల్ మీడియాలో వ్యక్తిగత వివరాలను పంచుకునే ముందు విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి. సైబర్ మోసాలు రోజురోజుకు పెరుగుతున్న నేపథ్యంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలి," అని సూచించారు. మాదక ద్రవ్యాలకు దూరం: సి.ఐ. కృష్ణారెడ్డి మాట్లాడుతూ, "డ్రగ్స్ వాడకం ఒక వ్యక్తి ఆరోగ్యాన్నే కాక, వారి కుటుంబాన్ని, భవిష్యత్తును పూర్తిగా నాశనం చేస్తుంది. యువత మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండి, తమ శక్తిని సృజనాత్మకమైన పనులపై కేంద్రీకరించాలి," అని హితవు పలికారు.

**ర్యాగింగ్‌పై విశ్వవిద్యాలయం కఠిన వైఖరి**

రిజిస్ట్రార్ డా. కె.సునీత మాట్లాడుతూ, "విద్యార్థులు తమ హక్కులతో పాటు బాధ్యతలను కూడా తెలుసుకోవాలి. యాంటీ ర్యాగింగ్ చట్టాలను ప్రతి ఒక్కరూ గౌరవించాలి," అని స్పష్టం చేశారు. క్యాంపస్‌లో ఏదైనా అనుచిత ప్రవర్తన లేదా ర్యాగింగ్ సంఘటన దృష్టికి వస్తే, వెంటనే విశ్వవిద్యాలయ యాంటీ ర్యాగింగ్ కమిటీకి సమాచారం ఇవ్వాలని ఆమె కోరారు. "సురక్షితమైన, స్నేహపూర్వకమైన, మరియు విలువలతో నిండిన క్యాంపస్ వాతావరణం అందరి సహకారంతోనే సాధ్యమవుతుంది," అని ఆమె పేర్కొన్నారు. అనంతరం ఎ.ఎస్.ఐ. శ్రీహరి, ఎస్.ఐ. రాకేష్ ర్యాగింగ్ చట్టపరమైన పరిణామాలు, శిక్షల గురించి విద్యార్థులకు వివరంగా తెలియజేసి వారిని చైతన్యపరిచారు. ఈ కార్యక్రమంలో ఆచార్య సిహెచ్ విజయ, స్టూడెంట్ వెల్ఫేర్ డీన్ డాక్టర్ ఆర్.ప్రభాకర్, హాస్టల్ వార్డెన్ డాక్టర్ అల్లం ఉదయ శంకర్, డాక్టర్ టి త్రివేణి, డాక్టర్ కె వి ఎల్ శ్రీకన్య రావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, యాంటీ ర్యాగింగ్ కమిటీ సభ్యులు, మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

# కరపలో అంగరంగా వైభవం జ్వాలాతోరణం





**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్, మండలం కేంద్రం కరప గ్రామంలోని పార్వత వర్ధిని సమేత శ్రీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా జ్వాలాతోరణం కార్యక్రమం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శ్రీనివాస్ మాట్లాడుతూ శివ కేశవులకు అత్యంత ప్రీతికరమైన కార్తీకమాసంలో వచ్చే పౌర్ణమి ఎంతో విశిష్టమైనది. ప్రతి యేడాదిలాగే ఈ రోజున జ్వాలాతోరణం ఏర్పాటు చేయడం ఒక పురాతన ఆచారం. దీన్ని దర్శించడానికి, దాటడానికి భక్తులు ఆతృతగా ఎదురుచూస్తారు అని తెలిపారు. కార్తీక పౌర్ణమి పుణ్య తిథి నాడు భక్తులు నోములు నోచుకుని స్వామివారిని ప్రత్యేక పూజలతో కొలిచారు. చంద్రదర్శనం అనంతరం ఆలయ ప్రాంగణంలో జరిగిన జ్వాలాతోరణ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ఘనంగా దీపాలు వెలిగించారు.

జ్వాలాతోరణ దర్శనం ఫలితంగా సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, ఐశ్వర్యాలు కలుగుతాయని, నరకలోక విమోచనతో స్వర్గప్రాప్తి లభిస్తుందని భక్తుల విశ్వాసం. పర్వత వర్ధిని సమేత శ్రీ రామ లింగేశ్వర స్వామి పల్లకీతో కూడిన ఊరేగింపులో భక్తులు జ్వాలాతోరణంకు అటు ఇటు మూడుసార్లు దాటి స్వామివారి కటాక్షం పొందారు.

# వికలాంగులకు నిత్యావసర సరుకులు పంపిణీ

**గూడూరు, (రాజధాని వార్తలు):** స్థానిక త్యాగరాజావీదిలోని శ్రీ కళ్యాణవీరభద్ర స్వామి దేవస్థానములో రెడ్ సంస్థ ఆద్వర్యంలో ఇన్నర్ వీల్ ఆంధ్ర మహిళా మండలి సహకారంతో 37 మంది పేద వికలాంగులకు నిత్యావసర వస్తువులు పంపిణీ చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికీ ముఖ్య అతిథిగా డా.రోహినమ్మ విచ్చేశారు. దాతలుగా స్వర్ణమ్మ - పరమేశ్వరమ్మలు 5000 అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు బి మాధురి, కార్యదర్శి లక్ష్మీ, పవిత్ర, రెడ్ సంస్థ సభ్యులు పాల్గొన్నారు.





## కార్తీక పౌర్ణమి సందర్భంగా రావి క్రోటన్ ఆకులపై మామిడికాయ క్వారింగ్‌తో ఈశ్వరుని చిత్రాలు... సోమా పద్మా రత్నం

**నెల్లూరు, (రాజధాని వార్తలు):** నెల్లూరు జిల్లా మనుబోలు మండలం వీరంపల్లి జడ్పీ హైస్కూల్ ప్రముఖ చిత్రకారుడు తెలుగు పండిట్ సోమా పద్మా రత్నం కార్తీక పౌర్ణమి సందర్భంగా రావి క్రోటన్ ఆకులపై మామిడికాయ క్వారింగ్‌తో ఈశ్వరుని చిత్రాలు అద్భుతంగా వేశారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ కార్తీక మాసం అంతా హర హర మహాదేవ శంభో శంకర అంటూ పరమేశ్వరుడి నామస్మరణతో మారుమోగుతుంది అంతేకాకుండా 365 వొత్తులతో దీపారాధన చేసి పరమేశ్వరుడిని కొలిచి భక్తి పారవశ్యంలో మునిగిపోతారు అలాగే అరటి దుప్పల్లో కార్తీక్ దీపాలను వెలిగించి ఆ దీపాలను పున్నమి వెలుగుల్లో నదిలో వదిలే సన్నివేశాన్ని ప్రత్యక్షంగా చూసి తరించాల్సిందే ఇక రుద్రాభిషేకాలు రుద్రపూజ లక్ష్మీ బిల్వదల పూజలు లక్ష పత్రి పూజ అమ్మవారికి లక్ష కుంకుమార్చన ఇలా ప్రత్యేక పూజలు వ్రతాలతో ప్రముఖ ఆలయాలన్నీ కిటకిటలాడుతాయి వనభోజనాలు మరో విశిష్టత కార్యంగా చెప్పుకోవచ్చు అని తెలియజేశారు.

# శ్రీశ్రీశ్రీ రాధాకృష్ణుల మహోత్సవ వేడుకలలో పాల్గొన్న చిన్న శ్రీను





**భీమిలి, (రాజధాని వార్తలు):** సాగర తీరం గోకుల పార్క్ వద్ద ఏర్పాటు చేసిన రాధాకృష్ణుల విగ్రహం వద్ద బుధవారం రాధాకృష్ణుల కలశ ప్రతిష్ట మహోత్సవం శ్రీ రాధాకృష్ణ ఉత్సవ ఆహ్వాన కమిటీ నాయకులు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమనికి ముఖ్య అతిథిగా భీమిలి నియోజకవర్గం వైకాపా ఇంచార్జి మజ్జి శ్రీనివాసరావు పూజ కార్యక్రమాల్లోపాల్గొని కృష్ణ భగవాన్ ఆశీస్సులు అందుకున్నారు. ఈ వేడుకల సందర్భంగా యాదవ సాంప్రదాయ కళలు కోలాటం, తప్పేట గుళ్ళు, చిడతలు వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. భక్తులు సముద్ర స్నానాలు ఆచరించి రాధా కృష్ణుల విగ్రహానికి పూజలు నిర్వహించారు. భక్తులకు మధ్యాహ్నం అన్న సమారాధన కార్యక్రమం ఏర్పాటు చేసారు. సాయంత్రం బీచ్ స్టేజీ వద్ద పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేసారు.

ఈ కార్యక్రమంలో యాదవ సంఘం పెద్దలు అక్కరమాని విజయనిర్మల, అక్కరమాని రాము నాయుడు, యలమంచిలి సూర్యనారాయణ, పున్నింటి వెంకట రమణ, గుడ్డాల ఎల్లయ్య, బమ్మిడి సూర్యనారాయణ, చినబాబు, రామ సూరప్పాడు, రామకృష్ణ, కోరాడ రమణ, అవినాష్, మురళీ తదితరులు పాల్గొన్నారు.

# తెలుగు భాషా పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత : వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు

**- వీఎస్‌యూలో ఘనంగా "తెలుగు భాషా పరిరక్షణ, పరిశోధన, పరివ్యాప్తి" జాతీయ సదస్సు**









**నెల్లూరు, (రాజధాని వార్తలు):** విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం (వీఎస్‌యూ) తెలుగు శాఖ, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో "తెలుగు భాషా పరిరక్షణ, పరిశోధన, పరివ్యాప్తి" అనే అంశంపై జాతీయ సదస్సు బుధవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఘనంగా జరిగింది. భారత ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ పరిధిలోని భారతీయ భాషా సంస్థ (మైసూరు) ఈ కార్యక్రమానికి సహకారం అందించింది. ఈ సదస్సును ఉద్దేశించి ముఖ్య అతిథిగా పాల్గొన్న వీఎస్‌యూ ఉపకులపతి ఆచార్య అల్లం శ్రీనివాసరావు కీలక ప్రసంగం చేశారు. "తెలుగు భాష భారతీయ సంస్కృతికి అద్దం పట్టే ప్రాచీన భాష. ఇందులో అపారమైన సాహిత్య వైభవం, భాషాశాస్త్ర పరంపర ఉన్నాయి. ఆధునిక సాంకేతిక యుగంలో భాషా పరిరక్షణ కేవలం పండితుల బాధ్యత కాదు, ప్రతి తెలుగు వారి ధర్మం. మాతృభాషలో ఆలోచించడం మన సృజనాత్మకతకు బలం ఇస్తుంది. భాషను సంరక్షించేందుకు విశ్వవిద్యాలయాలు, పరిశోధనా సంస్థలు, విద్యార్థులు, ప్రజలంతా కలిసికట్టుగా కృషి చేయాలి,"

**ప్రాచీన సాహిత్యమే మనకు స్ఫూర్తి**

ఈ సదస్సులో తి.తి.దే. అన్నమాచార్య ప్రాజెక్ట్ డైరెక్టర్, సుప్రసిద్ధ అవధాని డాక్టర్ మేడసాని మోహన్ కీలకోపన్యాసం చేశారు. "ప్రాచీన సాహిత్యంలో ఎన్నో విషయాలు మన భాషను, దాని పరివ్యాప్తిని ప్రస్ఫుటం చేస్తున్నాయి. ప్రధానంగా మహాభారతం రాసిన నన్నయ, తిక్కన, ఎర్రనలు రాసిన పద్యాలు, వాటి భావాలు, ఆయా సందర్భాలు తెలుగు భాష విస్తృతంగా పరిశోధన మరియు పరివ్యాప్తి కావడానికి ఎంతగానో దోహదం చేశాయి."

**సాహిత్యాన్ని డిజిటల్ యుగానికి అనుసంధానించాలి**

అనంతరం విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ డా.కె.సునీత మాట్లాడుతూ, భాషా పరిరక్షణలో సాంకేతికత పాత్రను నొక్కి చెప్పారు. "తెలుగు భాష మన ఆత్మీయతకు, సంస్కృతికి ప్రతిబింబం. ప్రాచీన సాహిత్య సంపదను నేటి యువతకు పరిచయం చేయడం, దానిని డిజిటల్ యుగానికి అనుసంధానం చేయడం అత్యంత అవసరం. ఈ జాతీయ సదస్సు ద్వారా తెలుగు భాషా పరిశోధనకు కొత్త మార్గాలు, నూతన ఆలోచనలు వెలువడతాయని, విద్యార్థులు మరియు పరిశోధకులు ఈ వేదికను సద్వినియోగం చేసుకోవాలని ఆకాంక్షిస్తున్నాను." ఈ సభకు సంచాలకులుగా ఆచార్య మాడభూషి సంపత్ కుమార్, కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య టి వీరారెడ్డి, తెలుగు విభాగాధిపతి డాక్టర్ మైల త్యాగరాజు, కన్వీనర్‌గా డాక్టర్ రాజారామ్, డాక్టర్ వెంకటేశ్వర్లు మరియు వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు పెద్ద సంఖ్యలో విద్యార్ధిని విద్యార్థు పాల్గొన్నారు.

# కేంద్ర ఆరోగ్య, శాఖ సంయుక్త కార్యదర్శి బి.అంకిత్ మిశ్రా ఐఏఎస్‌తో భేటీ అయిన పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు





**యానాం (ఢిల్లీ):** కేంద్ర ఆరోగ్యశాఖ సంయుక్త కార్యదర్శి బి.అంకిత్ మిశ్రా ఐఏఎస్‌తో భేటీ అయిన పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రత్యేక ప్రతినిధి మల్లాడి కృష్ణారావు. 1.యానాం, పరిసర గోదావరి జిల్లాలకు సమగ్ర క్యాన్సర్ వైద్య కేంద్రం. 2.కరైకల్ తరహాలో 50 సీట్లతో జిప్మర్‌కు అనుబంధంగా యానాంలో వైద్య కళాశాల 3. 11 పారా మెడికల్ కోర్సుల్ని ఏర్పాటు. వీటికి సంబంధించి గత ఏప్రిల్ 17వ తేదీన కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ రసాయనాల, ఎరువులశాఖ మంత్రి జేపీ నడ్డాకి ఇవ్వడం జరిగింది. యానాం జిప్మర్ యూనిట్లో ఉండాల్సిన పోస్టులు, పరికరాల (ఎక్విప్మెంట్) ఏర్పాటు తదితర నూతన సౌకర్యాలు కల్పించాలని కోరారు. యానాం సందర్శనకు రావాలని కోరిన మేరకు అతి త్వరలో యానాం, మంగళగిరి(ఏపీ) సందర్శనకు వస్తున్నట్లు అంకిత్ మిశ్రా తెలిపారు. అంకిత్ మిశ్రా గతంలో 2005 నుండి 2007 వరకు ప్రస్తుత ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పుదుచ్చేరి పర్యటక శాఖ మంత్రిగా ఉన్న సమయంలో పుదుచ్చేరి పర్యటక శాఖ డైరెక్టర్గా విధులు నిర్వహించారు. యానాంకు సంబంధించిన అంశాలపై వారు సానుకూలంగా స్పందించారని కేంద్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డాతో చర్చించి సమస్యలు పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవడం జరుగుతుందని మిశ్రా తెలిపారన్నారు.

# భక్తి శ్రద్ధలతో కార్తీక దీపం... భీమేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు





**సామర్లకోట, (రాజధాని వార్తలు):** కార్తీక మాసంలో అత్యంత పవిత్రమైన కార్తీక పౌర్ణమి పర్వదినం సందర్భంగా పంచారామక్షేత్రం అయిన సామర్లకోట శ్రీ కుమార రామ భీమేశ్వర స్వామి ఆలయానికి బుధవారం భక్తులు పెద్ద ఎత్తున పోటె త్తారు. తెల్లవారుజాము నుండి రాష్ట్ర నలుమూలల నుండి పెద్ద ఎత్తున భక్తులు ఆలయానికి చేరుకుని పవిత్ర కోనేరులో పుణ్యస్నానం ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం ఆలయ ప్రాం గణంలోని ఉసిరి చెట్టు వద్ద, ద్వజస్తంభం వద్ద, మారేడు వృక్షం, ఆలయ ముఖద్వారం వద్ద గోదావరి కాలువలో మహిళలు కార్తీక దీపాలు వదిలి ప్రత్యేక పూజలు చేపట్టారు. ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కంటే జగదీష్ మోహన్, కార్యనిర్వహణ అధికారి బళ్ళ నీలకంఠం ఆధ్వర్యంలో భక్తుల దర్శనాలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లను చేశారు. అలాగే నూతన వధూవరులు స్వామివారిని, అమ్మవారిని దర్శించు కుని మొక్కులు చెల్లించుకున్నారు. స్వామివారి దర్శనా నికి విచ్చేసిన భక్తులకు ఆలయ ఆవరణలో పెద్ద ఎత్తున అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఆలయ ఆవరణలో ఎటువంటి అవాం ఛనీయ సంఘటనలు జరగకుండా పెద్దాపురం డిఎస్ డి శ్రీహరి రాజు పర్యవేక్షణలో సామర్లకోట సిఐ కృష్ణ భగవాన్, క్రైమ్ సిఐ అంకబాబులు పెద్ద ఎత్తున బందోబస్తును నిర్వహించారు.

# కాకినాడ క్లీన్ సిటీగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలి : ఇంచార్జ్ కమిషనర్ కె టీ సుధాకర్





**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ నగరాన్ని క్లీన్ సిటిగా తీర్చిదిద్దే దిశగా ప్రతి పౌరుడు సహకరించాలని నగర పాలక సంస్థ ఇన్‌చార్జీ కమిషనర్ కె.టి.సుధాకర్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన పారిశుద్ధ్య సర్కిల్-1 పరిధిలోని కృష్ణనగర్, వైద్యనగర్ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం మస్తార్ కార్యాలయంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి పారిశుద్ధ్య కార్మికుల హాజరు పట్టికను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ "కాకినాడను పరిశుభ్రమైన నగరంగా తీర్చిదిద్దడంలో పౌరుల భాగస్వామ్యం అత్యంత కీలకం. ప్రతి ఒక్కరూ తమ పరిసరాలను శుభ్రంగా ఉంచి, చెత్తను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికే అందించాలి" అని తెలిపారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్పెక్టర్ దుర్గారావు పాల్గొన్నారు.

# పట్టపగలే గూడూరులో చోరీ



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు పట్టణం, పరిసర ప్రాంతాల్లో దొంగలు చెలరేగిపోతున్నారు. ఈ క్రమంలో గూడూరు ఒకటో పట్టణంలోని మిట్టపాలెంలో పట్టపగలే ప్రభుత్వ ఉపాధ్యాయులు ఇంట్లో దొంగతనం జరిగింది. ఉపాధ్యాయురాలు వల్లూరు శారద రోజు మాదిరిగానే ఉదయం తాళాలు వేసుకొని డ్యూటీకి బయలుదేరింది. సాయంత్రం ఇంటికి వచ్చేసరికి ఇంటికి వేసిన తాళాలు మారిపోయిన విషయం తెలుసుకొని వారి తోటి ఉద్యోగులకు విషయం చెప్పగా వారు ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్ లో పిర్యాదును అందుకున్న పోలీసులు చోరీ జరిగిన ఇంటికి చేరుకుని పరిశీలించారు. తాళాలు పగలగొట్టి చూడగా దొంగతనం జరిగిందని తెలిసింది. దీంతో ఉపాధ్యాయులు క్లూస్ టీం వచ్చి ఫింగర్ ప్రింట్లు తీసుకొనగా 1వ పట్టణ ఇన్చార్జి సీఐ జె.శ్రీనివాసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

# సంపాదకీయం

## బిహార్ ఓటర్లు కోరుతున్న మార్పు ఏమిటి

'బద్లావ్ తో హోనా ఛాహియే' (ఒక మార్పు రావాలి) అని తనను తాను 'నాయీ'గా స్వయంగా చెప్పుకున్న ఒక పెద్ద మనిషి అన్నాడు. ఆ వ్యాఖ్యకు ప్రతిస్పందనగా కర్పూరీ ఠాకూర్ గురించి నేను ప్రస్తావించాను. ఆయన ముఖంలో ఆనందరేఖలు విరిశాయి. అయితే తాను, తన కుటుంబంలోని 20 మంది ఓటర్లు ఓటు వేసేందుకు ప్రేరణ అయ్యే మార్పు ఏమిటో ఆయన విడమరిచి చెప్పలేదు. 'అబ్ ఆప్ సమ్జ్ జాయియే' (మీరు మీ అభిప్రాయానికి రావచ్చు) అని ఆయన నిష్కర్షగా అన్నాడు. మార్పు ఏమిటి? ప్రభుత్వం మారడం, పాలనా వ్యవస్థలో మార్పు సంభవించడమే మార్పు అని నేను విశ్వసిస్తున్నాను. బిహార్‌కే కాదు, దేశానికీ ఇటువంటి మార్పు అత్యవసరమని, జరూరుగా జరగాలని భావిస్తున్నాను. అయితే బిహార్ ఓటర్లు ఆకాంక్షిస్తున్న మార్పు బహు విధాలుగా ఉండడంతో పాటు అస్పష్టంగా ఉన్నది. ఉత్తర బిహార్‌లో పక్షం రోజుల పర్యటనతో ఈ వాస్తవం నాకు తెలిసివచ్చింది. మార్పు బహుళత్వం, అస్పష్టత గురించి నా పర్యటనానుభవాలు నన్ను జాగరూకుడిని చేశాయి. సాధారణ ఓటర్ల (అత్యధికులు పురుషులే)తో మాటా మంతీ ద్వారా బిహారీలు బహుళ మార్పులు కోరుతున్నారని, అవి ఒక దానితో ఒకటి పోటీ పడడమే కాకుండా ఘర్షణపడుతున్నాయని కూడా నాకు విశదమయింది. అనేక పరివర్తనలను సాధించవలసిన బృహత్తర బాధ్యతను సున్నిత ప్రజాస్వామిక సాధనమైన ఓటు నిర్వహిస్తోంది. ఆ పరివర్తనలను సంపూర్ణంగా సాధించడంలో ఇప్పటికే చాలా జాప్యం చోటు చేసుకున్నది. మొదటి మార్పు సామాజిక న్యాయం. అగ్ర కులాల ఆధిపత్యానికి వ్యతిరేకంగా సాధించవలసిన సామాజిక విప్లవం. బిహార్ జనాభాలో 11 శాతం కంటే తక్కువగా ఉన్న అగ్ర కులాలవారు సమాజం, ఆర్థిక వ్యవస్థ, రాజకీయాలపై సంపూర్ణ పెత్తనం చెలాయిస్తున్నారు. పేదలు, నిరుపేదలను సంఘటితపరచడం ద్వారా కుల వ్యవస్థ వెన్ను విరచడాన్ని లక్ష్యంగా చేసుకున్న మండల్ ఉద్యమానికి లాలూ ప్రసాద్ యాదవ్ నాయకత్వం వహించారు. అయితే ముఖ్యమంత్రి పదవిని ఆయన రెండు పర్యాయాలు నిర్వహించిన తరువాత ఆ సామాజిక విప్లవం నిలిచిపోయింది. పరిపాలన పట్ల అశ్రద్ధ, శాంతిభద్రతల పరిరక్షణ విషయంలో ఉదాసీనత, అధికారాన్ని ఒక కులం చుట్టూ కేంద్రీకృతం చేసి, కుటుంబ పాలన చేయడంతో లాలూ మూడో పర్యాయం పదవీ కాలం ముగించేనాటికి ప్రభుత్వం మారితీరవలసిన అనివార్యత ఏర్పడింది. సామాజికంగా వెనుకబడిన కులాల, ఆర్థికంగా వెనుకబడిన కులాల, మహా దళితుల మద్దతుతో అగ్ర కులాల ఆధిపత్యం మళ్లీ రాజ్యాధికారాన్ని సాధించుకున్నది. క్రింది స్థాయి సామాజిక శ్రేణులలో ఐక్యత యాదవ్ - ముస్లిం సంకీర్ణంగా సంకోచించింది (ఇటీవలి కుల గణన ప్రకారం బిహార్ జనాభాలో యాదవులు 14.2శాతం కాగా ముస్లింలు 17.7 శాతంగా ఉన్నారు). అగ్రకులాల/ వెనుకబడిన కులాల విభజన మధ్యలో నితీశ్ కుమార్ నిలబడ్డారు. తద్వారా బిహార్ రాజకీయాలలో ఒక కీలక నాయకుడుగా ఆయన ప్రభవించారు. సామాజిక విప్లవం తిరోగమనానికి ఆయన తోడ్పడ్డారు! ప్రస్తుత ఎన్నికలలో ప్రతిపక్ష కూటమి మహాఘట్‌బంధన్ తన సామాజిక సంకీర్ణాన్ని ముస్లిం - యాదవ్ సమీకరణ పరిధి నుంచి విస్తృతం చేసేందుకు ప్రయత్నించింది. మల్లాహ్ కులస్తులకు (బిహార్ జనాభాలో 2.6శాతం) ప్రాతినిధ్యం వహిస్తున్న ముఖేశ్ సహాని నాయకత్వంలోని వికాస్‌శీల్ ఇన్సాన్ పార్టీనిబీ చౌరాసియా, బరాయీ, తంబోలి సామాజిక వర్గాలకు (బిహార్ జనాభాలో 1.7శాతం) ప్రాతినిధ్యం వహిస్తున్న ఐపీ గుప్తా నేతృత్వంలోని ఇండియన్ ఇన్‌క్లూజివ్ పార్టీ (ఐఐపీ)కి మహాఘట్ బంధన్‌లో స్థానం కల్పించారు. బిహార్ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడుగా రవిదాసి వర్గానికి (బిహార్ జనాభాలో 5.6 శాతం) చెందిన నాయకుడిని నియమించడం ద్వారా కోల్పోయిన దళిత్ ఓటర్ల మద్దతు కూడగట్టుకునేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. ముస్లిం ఓటర్లను సంఘటితపరచడం ద్వారా లబ్ధి పొందేందుకు కూడా ప్రతిపక్ష కూటమి ప్రయత్నిస్తోంది. అయితే ఈ ప్రయత్నాల ద్వారా గత లోక్‌సభ ఎన్నికలలో ఎన్డీఏకు లభించిన 8శాతం ఓట్ల ఆధిక్యాన్ని తగ్గించటం లేదా స్వాయత్తం చేసుకోవటంలో మహాఘట్‌బంధన్ సఫలమవుతుందా అనేది వేచి చూడాలి. ఇక నిలిచిపోయిన రెండో పరివర్తన సుశాసన్ (సుపరిపాలన). అభివృద్ధి సాధనలో నాణ్యమైన ఫలితాలను సాధించవలసిన అవసరం మరే రాష్ట్రంలో కంటే బిహార్‌లోనే అత్యధికంగా ఉన్నది. నితీశ్ కుమార్ మొదటిసారి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు సుపరిపాలనకు శ్రీకారం చుట్టారు. పలు మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను నిర్విఘ్నంగా అమలుపరిచారు. రహదారుల నాణ్యతలో గణనీయమైన మెరుగుదలను సాధించారు. అయితే ఆ సుపరిపాలనా వెలుగులు ఎంతో కాలం నిలవలేదు. మసకబారిపోయాయి. ప్రజల మద్దతును నిలుపుకునేందుకు నితీశ్ ప్రభుత్వం అనేక గిమ్మిక్‌లు చేసింది. ప్రజల మద్దతును నిలబెట్టుకోగలిగింది గానీ సుపరిపాలనను కొనసాగించడంలో విఫలమయింది. నితీశ్ ప్రభుత్వం పదిహేను సంవత్సరాల క్రితం మంచిరోడ్లను నిర్మించిన విషయాన్ని బిహారీలు ఇప్పటికీ గుర్తు చేసుకొంటున్నారు. నితీశ్ రాక ముందు అన్నీ గతుకుల రోడ్లే కదా అని ఒక వృద్ధుడు వ్యాఖ్యానించాడు. నితీశ్ ప్రభుత్వం మద్యపానాన్ని నిషేధించింది. అయితే దీనికి ప్రజల మద్దతు సంపూర్ణంగా లభించలేదు. కల్తీ మద్యం విక్రయాలు పెరిగిపోయాయి. ఆ కల్తీ మద్యంతో సంభవిస్తున్న మరణాల సంఖ్య పెరిగిపోతూనే ఉన్నది. దీనికి తోడు మాదకద్రవ్యాల బెడద పెచ్చరిల్లింది.

# గాలిమేడను పునః నిర్మించండి

### - ఎమ్మెల్యే గంటాను కోరిన టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు



**భీమిలి, (రాజధాని వార్తలు):** భీమిలి ప్రాంతానికి చోయగాలు పొలికించే పురాతన గాలిమేడను పునఃనిర్మించాలని మాజీ మంత్రి వర్యులు, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి, అనకాపల్లి నియోజకవర్గం సంస్థాగత ఎన్నికల పరిశీలకులు గంటా నూకరాజు వినతిపత్రం ద్వారా విజ్ఞప్తి చేసారు. బుధవారం ఎంవిపి కాలనీలో ఉన్న ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు నివాసంలో కలిసి వినతిపత్రం అందించారు. భీమిలికి ఆధ్యాత్మిక పరంగా, సాంస్కృతికపరంగా ఎంతో ప్రావీణ్యత ఉందని అదేవిదంగా ఆంగ్లేయుల పాలనలో భీమిలి ప్రాంతంలో కొన్ని అదునాతన కట్టడాలు నిర్మించారని అందులో ఒకటి గాలిమేడ అని వివరించారు. సముద్ర తీరంలో నిర్మించిన గాలిమేడ ఎంతో చక్కని ఆహ్లాదాన్ని ఇచ్చిందనిఎమ్మెల్యే గంటాకు ఇచ్చిన వినతి పత్రంలో తెలియజేసారు. భీమిలికే వన్నె తెచ్చే విధంగా గాలిమేడ ఉండేదని రోజుకు కొన్ని వేల మంది పర్యాటకులు సందర్శించే వారని పదుల సంఖ్యలో సినిమా షూటింగ్స్ గాలిమేడను ఆధారంగా చేసుకొని నిర్మించారని అయితే పురాతన భవనం కావడం వలన రెండు దశబ్దాల క్రితం మొత్తం పడగొట్టాల్సి వచ్చిందని అన్నారు. కానీ నాటి గాలిమేడ తీపిగుర్తులు ఇంకా స్థానికులను, పర్యాటకులను అబ్బురపర్చే విధంగా ఉన్నాయని దయచేసి పాత గాలిమేడ నమూనా ఆధారంగా నూతన గాలిమేడను పునః నిర్మించినట్లయితే పర్యాటకంగా ఇంకా భీమిలి మంచి అభివృద్ధి చెందుతుందని, పర్యాటకులు పెరిగే అవకాశం ఉందని అదేవిదంగా భీమిలి చరిత్ర ఆధారంగా గోస్తనీ నది మధ్యలో భీముని యొక్క నిలువెత్తు విగ్రహం ఏర్పాటు చేసి చుట్టూ పార్క్‌గా అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావుకి ఇచ్చిన వినతిపత్రంలో గంటా నూకరాజు కోరారు.

# పన్ను చెల్లించని ఖాళీ స్థలాలలో జప్తు చేస్తూ కార్పొరేషన్ అధికారులు బోర్డులు ఏర్పాటు







**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ నగరంలో అనేక ఖాళీ స్థలాల యజమానులు పన్నులు చెల్లించకపోవడంతో నగరపాలక సంస్థ అధికారులు చర్యలకు ఉపక్రమించారు. పన్నులు చెల్లించని స్థలాలను ప్రభుత్వం 22(ఎ) జాబితాలో చేర్చి స్వాధీనం చేసుకునే ప్రక్రియను ప్రారంభించారు. జిల్లా కలెక్టర్ శణ్మోహన్ సగిలి ఆదేశాల మేరకు, నగరపాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ కె. శ్రీనివాస్ ఆధ్వర్యంలో అధికారులు ఖాళీ స్థలాలలో పన్ను చెల్లించకపోవుట వలన "ఈ ఖాళీ స్థలం జప్తు చేస్తున్నట్లు" బోర్డులను ఏర్పాటు చేస్తున్నారు.

ఇప్పటి వరకు నగరంలోని దాదాపు 30 ఖాళీ స్థలాలలో జప్తు బోర్డులను అధికారులు ఏర్పాటు చేశారు. ఈ నెల 25వ తేదీలోపు ఖాళీ స్థలాల యజమానులు తమ పన్నులు చెల్లించాలని డిప్యూటీ కమిషనర్ శ్రీనివాస్ సూచించారు. లేని పక్షంలో, ఆ తేదీ తర్వాత పన్నులు చెల్లించని స్థలాలను ప్రభుత్వం 22(ఎ) జాబితాలో చేర్చి స్వాధీనం చేసుకునే చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

# కరపలో వైభవంగా ఉప్పాలమ్మ కుంకుమ పూజలు





**కరప, (రాజధాని వార్తలు):** కాకినాడ రూరల్, మండల కేంద్రం కరప గ్రామదేవత ఉప్పాలమ్మ అమ్మవారి ఆలయంలో బుధవారం కార్తీక పౌర్ణమి సందర్భంగా కుంకుమపూజలను భక్తిశ్రద్ధల తో నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేక అలంకారాలతో పూజా కార్యక్రమాలు ఘనంగా చేపట్టారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి మహిళాభక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి కుంకుమ పూజలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. అన్నప్రసాద వితరణతో ముగిసిన ఈ కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు కుంకుమపూజలో పాల్గొంటే సంతానప్రాప్తి, ఆయురారోగ్యాలు, అష్టైశ్వ ర్యాలు సిద్ధిస్తాయని విశ్వసిస్తున్నారు. భక్తుల సౌకర్యా ర్థం దేవస్థాన అభివృద్ధి కమిటీ మరింత మెరుగైన ఏర్పాట్లు చేసింది.

కమిటీ సభ్యులు మాట్లాడుతూ గుడి పునర్నిర్మాణం జరిగినప్పటి నుండి ప్రతి నెలా పౌర్ణమి రోజున ఉదయం 9 గంటలకు కుంకుమా ర్చన, సాయంత్రం భజన కార్యక్రమాలు నిరంత రంగా జరుగుతున్నాయని తెలిపారు.

# మరిడమ్మ సన్నిధిలో ఘనంగా మహా చండీ హోమం - మహిళల కార్తీక దీపారాధనలు



**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలో కొలువై ఉన్న శ్రీ మరిడమ్మ అమ్మవారి దేవస్థానంలో కార్తీక పౌర్ణమి సందర్భంగా శ్రీ మరిడమ్మ అమ్మవారికి విశేష పూజలు చేపట్టారు. ఉదయం నుంచీ రాత్రి వరకు జరిగిన పూజల్లో భాగంగా ఆలయంలో మహా చండీ హోమం ఆలయ ఆసాదులు, వేదపారాయణదారులు పూజ, అర్చన కార్యక్రమములు చేపట్టారు. అలాగే ఆలయంలో కార్తీక దీపారాధన కార్యక్రమం నిర్వహించగ మహిళా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు చేపట్టారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ కార్యనిర్వాహనాధికారిణి, దేవాదాయ సహాయ కమిషనర్ కె విజయలక్ష్మి ఆధ్వర్యంలో క్యూ లైన్ లు, త్రాగునీరు, విద్యుత్ అలంకరణ, ప్రసాద వితరణ, బందోబస్తు ఏర్పాట్లు చేపట్టారు. ఈ పూజల్లో భక్తులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు ప్రత్యేక రీతిలో పులిహోర ప్రసాద వితరణ చేపట్టారు.

# బాలికల ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం




**పెద్దాపురం, (రాజధాని వార్తలు):** పెద్దాపురం పట్టణంలోని పద్మనాభ కాలనీలో గల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు "ఆరోగ్య అవగాహన" కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి పెద్దాపురం పట్టణానికి చెందిన శ్రీ ఆదిశ్ హాస్పిటల్స్ వైద్య అధికారిణి డా. గుమ్మళ్ళ సౌమ్య ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థినులకు ఆరోగ్య జాగ్రత్తలు వివరించారు. సాధారణ ఆరోగ్య సమస్యలు, వాటి నివారణ పద్ధతులు, అలాగే అమ్మాయిలు పాటించవలసిన సరైన ఆహారపు అలవాట్లు, పరిశుభ్రత వంటి అంశాలపై సూచనలు అందించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తమ సందేహాలను డా. సౌమ్యను అడిగి నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్ర మం ద్వారా విద్యార్థినులలో ఆరోగ్యంపై అవగాహన పెంచడం, ఆరోగ్యకరమైన జీవనశైలిని అలవర్చుకోవడమే ప్రధాన లక్ష్యమని పాఠశాల హెచ్ ఎం బిజె రవీంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

# శ్రీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తా : ఎమ్మెల్యే సునీల్ కుమార్



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు పట్టణం రాజా వీధిలో కొలువై ఉన్న శ్రీ శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ అభివృద్ధికి భక్తులకు మెరుగైన సౌకర్యాలు తన వంతు కృషి చేస్తానని గూడూరు నియోజకవర్గ ఎమ్మెల్యే సునీల్ కుమార్ పేర్కొన్నారు. బుధవారం గూడూరు పట్టణంలోని శ్రీ ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో నూతన కమిటీ చైర్మన్‌గా శ్రీకంటి రామ్మోహన్ రావు, డైరెక్టర్లు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ చైర్మన్‌గా శ్రీకంటి రామ్మోహన్ రావు ఎంతో దైవభక్తి గలవాడని భక్తులకు అన్ని సౌక ర్యాలు కల్పించేందుకు కృషి చేస్తారని అలాంటి వ్యక్తి చైర్మన్‌గా కావడం ఆలయానికి కాకుండా గూడూరు పట్టణ ప్రజలకు కూడా ఎంతో సంతోషకరమైన విషయం అన్నారు. అనంతరం నూతన కమిటీ సభ్యుల ప్రమాణ స్వీకారాన్ని ఆలయ ఈవో చేయించారు.

# కార్తీక పౌర్ణమి ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే దంపతులు



**కందుకూరు, (రాజధాని వార్తలు):** కందుకూరు పట్టణంలోని స్కందపురి సోమేశ్వరాలయం నందు బుధవారం ఉదయం స్థానిక ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు దంపతులు కార్తీక పౌర్ణమి వేడుకలను పురస్కరించుకొని అభిషేక కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించడం జరిగింది. పవిత్రమైన కార్తీక పౌర్ణమి సందర్భంగా కందుకూరు శాసన సభ్యులు ఇంటూరి నాగేశ్వరరావు, ఆయన సతీమణి సౌజన్య తదితరులు శ్రీ గంగా సమేత స్కందపురి సోమేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి వేకువ జామున అభిషేక పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వామి వారి ఆలయ ప్రాంగణంలో ఎమ్మెల్యే దంపతులు కార్తీక దీపం వెలిగించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయం ముందు ఏర్పాటు చేసిన శివలింగమూర్తికి ఎమ్మెల్యే దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయానికి విచ్చేసిన ఎమ్మెల్యే దంపతులకు ఆలయ అర్చకులు వేద ఆశీర్వచనం, తీర్థప్రసాదాలు, స్వామివారి శేష వస్త్రాన్ని అందజేశారు. కందుకూరు పట్టణ పట్టణ ఆర్యవైశ్యులు ఏర్పాటు చేసిన ప్రసాదాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగేశ్వరరావు దంపతులు పాల్గొని స్వయంగా భక్తులకు ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో సోమేశ్వర స్వామి ఆలయం ఈ.ఓ రవికుమార్, కందుకూరు పట్టణ ఆర్యవైశ్య నాయకులు మురారిశెట్టి సుధీర్ కుమార్, కొత్త వెంకటేశ్వర్లు, చక్కా వెంకట కేశవ రావు, కోటా కిషోర్ బాబు, కంకణాల వెంకటేశ్వర్లు, ఓరుగంటి శివ శంకర్, మురారిశెట్టి వెంకటేష్, మద్ది. వెంకట సురేష్ గుప్తా తోబాటు కందుకూరు పట్టణ టీడీపీ మాజీ అధ్యక్షులు పిడికిటి. వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

# కాంప్రమైజ్ కాలేకనే బంపరాఫర్‌ను వదులుకున్నా!



ఒకరు చేయాల్సిన సినిమాలు వారు వదులుకోవడం వల్లనో లేక మరే ఇతర కారణాల వల్లనో వేరే వారి చేతుల్లోకి వెళ్తాయి. అయితే ఆ విషయాలు కొన్ని సార్లు బయటకు వస్తే మరికొన్ని సార్లు మరుగున పడతాయి. ఇంకొన్ని సార్లు చాలా ఏళ్ల తర్వాత అనుకోకుండా ఆ విషయాలు బయట పడుతూ ఉంటాయి. ఇప్పుడలానే ఓ విషయాన్ని వెల్లడించారు బాలీవుడ్ నటి రవీనా టాండన్. 1993లో వచ్చిన డర్ మూవీ హీరోయిన్‌గా బాలీవుడ్‌లో ఎన్నో సినిమాలు చేసిన రవీనా గతంలో తాను ఓ సూపర్ స్టార్ ఫిల్మ్‌ను వదులుకున్నట్టు ఇన్నేళ్ల తర్వాత బయటపెట్టారు. ఆ సినిమానే డర్. బాలీవుడ్ స్టార్ డైరెక్టర్ యష్ చోప్రా దర్శకత్వంలో 1993లో వచ్చిన డర్ సినిమాలో సన్నీ డియోల్, షారుఖ్ ఖాన్‌గా నటించగా, ఆ సినిమా కోసం మేకర్స్ ముందుగా తననే సంప్రదించారని చెప్పారు రవీనా. ఆ సినిమాలోని కొన్ని సీన్స్ నచ్చకపోవడం మరియు మూవీలో స్విమ్ సూట్‌లో కనిపించాల్సి రావడం వల్లే డర్ మూవీని తాను వదులుకున్నట్టు 32 ఏళ్ల తర్వాత రవీనా అసలు విషయాన్ని బయటపెట్టారు. కెరీర్ స్టార్టింగ్ నుంచి తనకు తానుగా కొన్ని రూల్స్‌ను పెట్టుకున్నానని, వాటిని బ్రేక్ చేసి కాంప్రమైజ్ అవడం ఇష్టలేకనే భారీ ఆఫర్ అయినప్పటికీ దాన్ని రిజెక్ట్ చేసినట్టు రవీనా వివరించారు. అయితే తాను డర్ సినిమాకు నో చెప్పాక ఆ ఛాన్స్ జూహీ చావ్లాకు వెళ్లిందని ఆమె గుర్తు చేసుకున్నారు. డర్ మూవీలో సన్నీ డియోల్ హీరోగా నటించగా, షారుఖ్ విలన్‌గా మెప్పించారు. డర్ మూవీ బాక్సాఫీస్ వద్ద భారీ బ్లాక్ బస్టర్‌గా నిలవడమే కాకుండా, ఆ సినిమాలో షారుఖ్ యాక్టింగ్‌కు ఎన్నో ప్రశంసలు కూడా వచ్చాయి. ఈ మూవీకి షారుఖ్ బెస్ట్ విలన్‌గా ఫిల్మ్ ఫేర్ అవార్డు కూడా అందుకున్నారు. డర్‌తో పాటూ ప్రేమ ఖైదీ ఆఫర్ కూడా ముందుగా తనకే వచ్చిందని, అందులో కూడా ఓ సీన్ నచ్చకపోవడం వల్లే ఆ ఆఫర్‌ను కూడా వదులుకున్నట్టు చెప్పిన రవీనా, కెరీర్ స్టార్టింగ్‌లో చాలా చిన్న విషయాలకు కూడా సినిమాలను వదులుకునే దాన్నని అన్నారు. నచ్చని వ్యక్తులతో తాను మొదటి నుంచే యాక్ట్ చేయనని, ఇప్పటికీ తాను దాన్నే ఫాలో అవుతున్నట్టు రవీనా చెప్పుకొచ్చారు.

# బాహుబలి తరహా సినిమాతో సుధీర్ బాబు..!



సుధీర్ బాబు హీరోగా రూపొందిన 'జటాధర' సినిమా పాన్ ఇండియా రేంజ్‌లో రేపు అంటే నవంబర్ 7న విడుదల కాబోతున్న విషయం తెల్సిందే. వరుస సినిమాలతో బాక్సాఫీస్ వద్ద సందడి చేస్తున్న సుధీర్ బాబు సక్సెస్ రేటు చాలా తక్కువగా ఉంది, ఆయన గత చిత్రాలు సైతం ఆశించిన స్థాయిలో విజయాన్ని సొంతం చేసుకోలేక పోయాయి. అయితే సుధీర్ బాబు తన ప్రతి సినిమాతోనూ నటుడిగా మంచి పేరు తెచ్చుకోవడంతో పాటు, విభిన్నమైన కథలు చేస్తున్నాడు అంటూ ప్రశంసలు దక్కించుకుంటున్నాడు. అందుకే ఆయన కెరీర్ ఇప్పటికీ కొనసాగుతూనే ఉంది. సుధీర్ బాబు తాజాగా చేసిన జటాధర సినిమాపై కూడా ఆసక్తి నెలకొంది. ఇప్పటి వరకు వచ్చిన ప్రమోషనల్ స్టఫ్‌ను చూస్తే మంచి కంటెంట్ ఓరియంటెడ్ మూవీ అంటూ చాలా మంది అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే ఈ సినిమాకు సెన్సార్ కార్యక్రమాలు పూర్తి అయ్యాయి. సెన్సార్ బోర్డ్ నుంచి ఈ సినిమాకు ఎ సర్టిఫికెట్ వచ్చిన విషయం తెల్సిందే. సెన్సార్ బోర్డ్ నుంచి సినిమాకు పాజిటివ్ రెస్పాన్స్ వచ్చిందని చిత్ర యూనిట్ సభ్యులు అంటున్నారు. ఈ సినిమాతో బాలీవుడ్ ముద్దుగుమ్మ సోనాక్షి సిన్హా తెలుగు ప్రేక్షకుల ముందుకు రాబోతున్న విషయం తెల్సిందే. చాలా మంది బాలీవుడ్ ముద్దుగుమ్మలు టాలీవుడ్‌లో అడుగు పెట్టి మంచి పేరును సొంతం చేసుకున్నారు. కాస్త లేట్‌గా టాలీవుడ్‌లో అడుగు పెట్టబోతున్న సోనాక్షి సిన్హా కచ్చితంగా తెలుగు ప్రేక్షకులను మెప్పిస్తుందనే విశ్వాసం వ్యక్తం అవుతోంది. ఈ సినిమా ప్రమోషన్‌లో భాగంగా చిత్ర యూనిట్ సభ్యులు మీడియాతో ముచ్చటిస్తూ పలు ఆసక్తికర విషయాలను షేర్ చేసుకున్నారు. సినిమా నేపథ్యం గురించి ఆసక్తికర వ్యాఖ్యలు చేయడంతో అంచనాలు పెరిగాయి. ఇటీవల ఒక మీడియా సమావేశంలో హీరో సుధీర్ బాబు మాట్లాడుతూ... ఆత్మల అన్వేషణ, ఫ్యామిలీ ఎమోషన్స్, డెవోషనల్ ఎలిమెంట్స్‌తో ఈ సినిమా సాగుతుంది. ఈ సినిమాను ఒప్పుకోవడానికి ప్రధాన కారణం ఫ్లాష్‌బ్యాక్ ఎపిసోడ్. ఆ సీన్స్‌లో పాత్రల మధ్య భావోద్వేగాలు, ఆ సమయంలో ఉండే కథ చాలా బాగుంటుంది. అందుకే నేను ఈ సినిమాను ఒప్పుకున్నాను అన్నాడు. డబ్బును భూమిలో దాచిపెట్టి, దానికి ఆత్మలతో, పిశాచిలతో రక్షణ ఏర్పాటు చేస్తారు అని చాలా కథలు విన్నాం. అలాంటి పాయింట్స్‌తో ఈ సినిమా సాగుతుంది అన్నాడు. సినిమా తప్పకుండా ప్రతి ఒక్కరిని మెప్పిస్తుందనే విశ్వాసం వ్యక్తం చేశాడు. ఈ సినిమాను తెలుగుతో పాటు బాలీవుడ్‌లో కూడా విడుదల చేయబోతున్నట్లుగా చిత్ర యూనిట్ సభ్యులు చెప్పుకొచ్చారు. సుధీర్ బాబుకు బాలీవుడ్‌లో ఉన్న గుర్తింపు కారణంగా అక్కడ కూడా మంచి ఓపెనింగ్స్ దక్కించుకునే అవకాశాలు ఉన్నాయి. బాలీవుడ్‌లో సినిమాలు చేసిన తర్వాత వరుసగా అక్కడ నుంచి ఆఫర్లు వచ్చాయని, కానీ పూర్తిగా తెలుగు సినిమాల మీద దృష్టి పెట్టాలనే ఉద్దేశంతో ఆ ఆఫర్‌లను వెనక్కి పంపిచినట్లుగా సుధీర్ బాబు చెప్పుకొచ్చాడు. ప్రస్తుతం తెలుగులోనే సినిమాలు చేసేందుకు రెడీ అవుతున్నట్లు పేర్కొన్నాడు. జటాధర సినిమా తర్వాత రాహుల్ రవీంద్రన్ దర్శకత్వంలో ఒక సినిమాను చేయబోతున్నాను. ఆయన చెప్పిన కథ చాలా యూనిక్‌గా అనిపించింది. ఇప్పటి వరకు ప్రపంచంలో ఎవరూ టచ్ చేయని కాన్సెప్ట్‌తో సినిమాను చేయబోతున్నామని అన్నాడు. అంతే కాకుండా ఆ సినిమా బాహుబలి తరహాలో ఉంటుందని కూడా సుధీర్ బాబు చాలా నమ్మకంగా వ్యాఖ్యలు చేశాడు. రాహుల్ రవీంద్రన్ ప్రస్తుతం ది గర్ల్‌ఫ్రెండ్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చేందుకు రెడీ అవుతున్నాడు. ఆ సినిమా తర్వాత సుధీర్ బాబు సినిమా ఉంటుంది. వచ్చే ఏడాదిలో వీరి కాంబో ప్రారంభం అయ్యే అవకాశాలు ఉన్నాయి. నిజంగానే సుధీర్ బాబు అన్నట్లుగా బాహుబలి తరహా సినిమా అయితే కచ్చితంగా ప్రేక్షకుల నుంచి మంచి ఆదరణ లభించడం ఖాయం.

# చీరకట్టులో హృదయాన్ని తాకుతున్న మానస చౌదరి!



ఈ మధ్యకాలంలో సెలబ్రిటీలు గ్లామర్‌తోనే కాదు సాంప్రదాయంగా ఆకట్టుకుంటూ అభిమానులలో గౌరవాన్ని పెంచుకుంటున్నారు. మరి కొంతమంది ఆ చీరకట్టులో కూడా గ్లామర్ వలకబోస్తూ ఫ్యాన్స్‌ను ఫిదా చేస్తున్నారు. ఈ క్రమంలోనే తాజాగా చీరకట్టులో కనిపించి, యువత హృదయాన్ని తాకుతూ అందరి దృష్టిని ఆకర్షించింది యంగ్ బ్యూటీ మానస చౌదరి. తాజాగా చీరకట్టులో దర్శనమిచ్చిన ఈమె.. తన అందాలతో అభిమానులను ఆకట్టుకుంది. సాంప్రదాయంగా కనిపిస్తూ తనపై గౌరవాన్ని మరింత పెంచుకుంది అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. విషయంలోకి వెళ్తే.. ఈ మధ్యకాలంలో సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ ఫాలోవర్స్‌ను పెంచుకుంటూ అభిమానులకు చేరువవుతున్న నటీమణులలో మానస చౌదరి కూడా ఒకరు. ప్రస్తుతం సోషల్ మీడియాలో పర్పుల్ ట్రెండ్ నడుస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఇటు సెలబ్రిటీలు కూడా పర్పుల్ కలర్ డ్రెస్సులు, చీరలు ధరించి ట్రెండుని బాగా యూజ్ చేసుకుంటున్నారు. అందులో భాగంగానే తాజాగా మానస చౌదరి కూడా ఇలా పర్పుల్ కలర్ చీర ధరించి తన అందాన్ని రెట్టింపు చేసుకుంది. సింగిల్ ప్లేర్ తో పైను సరిచేసిన ఈమె.. తన జుట్టును గాలికి వదిలేసి తన స్టైలిష్ లుక్కును కంప్లీట్ చేసింది. ఈ చీర కట్టులో ఎంతో అందంగా ముద్దుగా కనిపిస్తోంది అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. అందులో భాగంగానే ఇటు సెలబ్రిటీలు కూడా పర్పుల్ కలర్ డ్రెస్సులు, చీరలు ధరించి ట్రెండుని బాగా యూజ్ చేసుకుంటున్నారు. అందులో భాగంగానే తాజాగా మానస చౌదరి కూడా ఇలా పర్పుల్ కలర్ చీర ధరించి తన అందాన్ని రెట్టింపు చేసుకుంది. సింగిల్ ప్లేర్‌తో పైను సరిచేసిన ఈమె.. తన జుట్టును గాలికి వదిలేసి తన స్టైలిష్ లుక్కును కంప్లీట్ చేసింది. ఈ చీర కట్టులో ఎంతో అందంగా ముద్దుగా కనిపిస్తోంది అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు. ప్రస్తుతం మానస చౌదరికి సంబంధించిన ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారుతున్నాయి. మానస చౌదరి కెరియర్ విషయానికి వస్తే.. సుమా కొడుకు రోషన్ కనకాల హీరోగా వచ్చిన బబుల్గం చిత్రం ద్వారా ఇండస్ట్రీకి పరిచయమైంది తెలుగు అమ్మాయి మానస చౌదరి. ఈ సినిమా ప్రమోషన్స్‌లో పాల్గొన్న ఈమె తన బ్యాక్ గ్రౌండ్ గురించి కూడా చెప్పుకొచ్చింది. మానస చౌదరి మాట్లాడుతూ.." నేను చిత్తూరు జిల్లా పుత్తూరులో జన్మించాను. కానీ చెన్నైలో పెరిగాను. మా నాన్న వ్యాపారం చేస్తారు. నాకు ఎటువంటి సినిమా నేపథ్యం లేదు. నిజానికి నేను ఇండస్ట్రీలోకి రావాలనుకోలేదు. కానీ కాలక్రమేణా సినిమాపై ఇష్టం పెరిగి, ఇండస్ట్రీలోకి వచ్చాను. ఇదే విషయాన్ని మొదటి మా అమ్మ నాన్నతో చెబితే వారు కూడా నాకు తమ ప్రోత్సాహాన్ని అందించారు. తల్లిదండ్రుల సహాయంతో చదువు పూర్తి చేసి, మోడలింగ్ ప్రారంభించాను. అదే సమయంలో ఒక ఫ్రెండ్ ద్వారా దర్శకుడు రవికాంతకు నా ప్రొఫైల్ పంపించి..ఆయన టీం నుంచి కాల్ రావడంతో ఫోటోషూట్ చేసాము. అలా నా సినిమా జర్నీ మొదలైంది అంటూ మానస చౌదరి తన సినీ కెరియర్ గురించి చెప్పుకొచ్చింది. ఇకపోతే బబుల్గం సినిమాలో మానస చౌదరి చేసింది తొలిసారి అయినా ఈమె ఆన్ స్క్రీన్ కెమిస్ట్రీకి అభిమానులు ఫిదా అవుతున్నారు. అద్భుతమైన నటన కనబరిచింది అంటూ ఆమెపై ప్రశంసలు కురిపిస్తున్నారు. మొత్తానికైతే మొదటి సినిమాతోనే అందరి దృష్టిని ఆకర్షించింది మానస చౌదరి.

# 'ది గర్ల్‌ఫ్రెండ్' సెన్సార్ రిపోర్ట్




ఈ ఏడాది నేషనల్ క్రష్ రష్మిక మందన్నకి అంతా బాగా జరుగుతోంది. బాలీవుడ్ మూవీ ఛావాతో ఈ ఏడాదిని ఆరంభించి బిగ్గెస్ట్ బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకున్న విషయం తెల్సిందే. రష్మిక మందన్న ఈ ఏడాదిలో చేసిన అన్ని సినిమాలు కమర్షియల్‌గా మినిమం గ్యారెంటీ అన్నట్లుగా వసూళ్లు సాధించాయి. సల్మాన్ ఖాన్‌తో నటించిన సికిందర్ సినిమా డిజాస్టర్ టాక్ దక్కించుకున్నప్పటికీ వంద కోట్లకు పైగా వసూళ్లు సాధించడం ద్వారా కమర్షియల్‌గా పర్వాలేదు అనిపించుకుంది. కుబేరా సినిమాతోనూ వంద కోట్లు, అంతకు మించి వసూళ్లు సాధించిన రష్మిక మందన్న ఇటీవల బాలీవుడ్ మూవీ థామాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. హిందీ ప్రేక్షకులను థామా సినిమా ఆకట్టుకోవడంలో విఫలం అయ్యింది అంటూ విమర్శలు వచ్చాయి. కానీ సినిమా వసూళ్ల పరంగా మాత్రం డీసెంట్‌గానే నిలిచింది. థామా సినిమా బాక్సాఫీస్ వద్ద డీసెంట్ ఓపెనింగ్స్ రాబట్టడంలో రష్మిక కీలక పాత్ర పోషించింది. రష్మిక నుంచి ఈ ఏడాది చివర్లో రాబోతున్న మరో సినిమా 'ది గర్ల్ ఫ్రెండ్'. ఈ సినిమా పై అంచనాలు భారీగా ఉన్నాయి. అల్లు అరవింద్ సమర్పిస్తున్న ఈ సినిమాపై అంచనాలు పెంచే విధంగా ట్రైలర్ ఆకట్టుకుంది. సినిమా ప్రమోషన్ కార్యక్రమాల్లో రష్మిక సందడి చేసింది. పాన్ ఇండియా రేంజ్‌లో విడుదల కాబోతున్న ది గర్ల్‌ఫ్రెండ్ సినిమా ఒక మంచి ఫీల్ గుడ్ మూవీ అని, ప్రతి ఒక్కరూ చూడాల్సిన సినిమా అంటూ అల్లు అరవింద్ ఇటీవల ఒక మీడియా సమావేశంలో పాల్గొన్న సమయంలో చెప్పిన విషయం తెల్సిందే. దాంతో ఈ సినిమాపై ఆసక్తి నెలకొంది. రేపు విడుదల కాబోతున్న ఈ సినిమాకు సంబంధించిన సెన్సార్ కార్యక్రమాలు తాజాగా పూర్తి అయ్యాయి. చిత్ర యూనిట్ సభ్యులు తాజాగా సినిమా సెన్సార్ కంప్లీట్ పోస్టర్‌ను షేర్ చేయడం ద్వారా మరోసారి అందరి దృష్టిని ఆకర్షించడం జరిగింది.

లేడీ ఓరియంటెడ్ మూవీ అంటూనే ఈ సినిమాకు సెన్సార్ బోర్డ్ నుంచి యూ/ఎ సర్టిఫికెట్‌ను తీసుకోవడంతో ఇందులో ఉన్న ఆ ఎ కంటెంట్ ఏమై ఉంటుందా అనే చర్చ జరుగుతోంది. సెన్సార్ బోర్డ్ సభ్యులు ఈ సినిమాకి చిన్న చిన్న కట్స్ చెప్పి, కొన్ని డైలాగ్స్‌ను మ్యూట్ చేసి యూ/ఎ సర్టిఫికెట్ జారీ చేయడం జరిగిందని చిత్ర యూనిట్ సభ్యుల ద్వారా తెలుస్తోంది. సినిమా విషయంలో సెన్సార్ బోర్డ్ నుంచి పాజిటివ్ రెస్పాన్స్ వచ్చిందని తెలుస్తోంది.

# మిథున్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన వైఎస్ఆర్సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు నేలపూడి స్టాలిన్



**హైదరాబాద్, (రాజధాని వార్తలు):** న్యూయార్క్‌లో నిర్వహించిన ఐక్యరాజ్యసమితి 80వ సర్వసభ్య సమావేశానికి హాజరై భారత తరపున బలమైన వాదనలు వినిపించి దేశానికి తిరిగి వచ్చిన వైఎస్ఆర్సిపి పార్లమెంట్ సభ్యులు పీ మిథున్ రెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో వైఎస్ఆర్సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్ సభ్యులు నేలపూడి స్టాలిన్ బాబు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. ఐక్యరాజ్యసమితి 80వ సర్వసభ్య సమావేశంలో భారత్ తరపున ఎంపీ మిథున్ రెడ్డి ప్రసంగించారు. స్టాలిన్ బాబు మాట్లాడుతూ ఐక్యరాజ్యసమితి సమావేశంలో ఎంపీ మిథున్ రెడ్డి భారత ప్రతిష్ట ని ఇనుమిడింప చేశారని, ఈ సమావేశాల్లో ఆయన పరస్పర సంప్రదింపులు, చర్చల ద్వారానే వివాదాలకు పరిష్కారం దొరుకుతుందనే విషయాన్ని మరియు వర్తకం, పెట్టుబడుల్లో తలెత్తే వివాదాల పరిష్కారాలకు ఐక్యరాజ్యసమితి విధానాలకు అనుగుణంగా భారత్ పని చేస్తోందని, అంతర్జాతీయ సంస్థలు, ప్రభుత్వాల మధ్య వివాదాలను కూడా మధ్యవర్తిత్వం, ప్రత్యామ్నాయ విధానాల ద్వారా శాంతి యుతంగా పరిష్కరించుకోవచ్చనే విషయాలను ఆయన ప్రసంగాల ద్వారా ఐక్యరాజ్యసమితికి తెలియజేశారని అన్నారు.

# ఎం.పీ.డీ.వో ఆకస్మిక తనిఖీలు



**గజపతినగరం, (రాజధాని వార్తలు):** ఎంపీడీవో బి.కళ్యాణి బుధవారం మండలంలోని సీతారాంపురం గ్రామంలో గల సచివాలయం, అంగన్వాడి కేంద్రం, ప్రాథమిక పాఠశాలలను ఆకస్మికంగా సందర్శించి తనిఖీలు చేపట్టారు.

ముందుగా ఆమె సచివాలయంలో రికార్డులను, రిజిస్టర్‌లను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్నం భోజనం వంటకాలను పరిశీ లించి రుచి చూసారు. అలాగే అంగన్వాడి కేంద్రంలో చిన్నారులతో కాసేపు ముచ్చటించి, అక్కడ రికార్డులను కూడా పరిశీలించారు.

# ప్రభుత్వ సేవలు సత్వరమే అందాలి : జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి





**పూసపాటిరేగ, డెంకాడ, విజయనగరం, (రాజధాని వార్తలు):** ప్రజలకు ప్రభుత్వ సేవలను తక్షణమే అందించాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి ఆదేశించారు. ఆయన బుధవారం డెంకాడ, పూసపాటిరేగ మండలాల్లో ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ముందుగా డెంకాడ తాహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. రాష్ట్రప్రభుత్వం ఆన్‌లైన్ ద్వారా అందిస్తున్న సేవలపై తహసీల్దార్ రాజారావును ఆరా తీశారు. ధరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తూ, పెండింగ్ లేకుండా చూడాలని ఆదేశించారు. నిర్ణీత కాలవ్యవధిలోగా పరిష్కారం చూపాలని సూచించారు. పూసపాటిరేగ మండలంలో కలెక్టర్ పర్యటించారు. ముందుగా ఎంపిడిఓ కార్యాలయాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. అధికారులు అందుబాటులో లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆన్‌లైన్ సేవలపై ప్రశ్నించారు. పెండింగ్‌లో లేకుండా చూడాలని, నిర్ణీత సమయంలోగా సేవలను అందించాలని డి.టి సంజీవ్‌కుమార్‌ను కలెక్టర్ ఆదేశించారు.

# పొదెం వీరయ్యకు శుభాకాంక్షలు తెలియపరిచిన భద్రాచలం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్



**భద్రాచలం, (రాజధాని వార్తలు):** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా భద్రాచలం కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర అటవీ శాఖ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పొదెం వీరయ్యను భద్రాచలం ఆయన క్యాంప్ కార్యాలయం నందు మర్యాద పూర్వకంగా కలిసి జాతీయ ఆదివాసీ కాంగ్రెస్ సలహా మండలి ప్రత్యేక ఆహ్వానితులుగా నియమించబడిన సందర్భంగా పోదేం వీరయ్యని శాలువా, పూలబొకేతో సన్మానించి శుభాకాంక్షలు తెలియపరచడం జరిగింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మహిమూద్ ఖాన్. భద్రాచలం పట్టణ కాంగ్రెస్ పార్టీ మైనార్టీసెల్ అధ్యక్షులు ఎస్.కె అలీమ్. గౌరవ అధ్యక్షులు ఎస్కే ఉస్మాన్. ప్రధాన కార్యదర్శి ఎస్.కె కాసిం పాషా. ఉపాధ్యక్షులు ఎండి. అలీ. సైరుద్దీన్. సీనియర్ నాయకులు ఎస్కే మస్తాన్. మైనార్టీ సెల్ మహిళా విభాగం ముంతాజ్ బేగం. ఎస్.కె సహిర. రిజ్వానా తదితరులు పాల్గొన్నారు.

# మద్యం బాటిళ్లతో ఒకని అరెస్ట్



**గజపతినగరం,(రాజధాని వార్తలు):** తమ సర్కిల్ పరిధిలోని దత్తిరాజేరు మండలంలోని వివిధ గ్రామాల్లో జరిపిన దాడుల్లో వి. కృష్ణాపురం గ్రామంలో ఏడు మద్యం సీసాలతో వి.సన్యాసి అనే వ్యక్తి పట్టుబడినట్లు స్థానిక ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జె. జనార్ధన రావు బుధవారం తెలిపారు. ఈ మేరకు సన్యాసిపై కేసు నమోదు చేసామన్నారు. ఈ దాడుల్లో ఎస్.ఐలు పి.నరేంద్ర కుమార్, పి. శాంతిలక్ష్మి, హెచ్. సి.ఎం.డి.జె. భాషా, కానిస్టేబుల్ ఏ.అప్పారావు పాల్గొన్నారు.

# రాష్ట్రస్థాయి "కోకో" పోటీలకు గంగచొల్లపెంట విద్యార్థులు




**గజపతినగరం, (రాజధాని వార్తలు):** రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ కోకో పోటీలకు మండలంలోని గంగచొల్లపెంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఆరుగురు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ చింత సత్యనారాయణ బుధవారం తెలిపారు. బుధవారం విజయనగరం విజ్జి స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రదర్శన కనబరిచి ఎంపికయ్యారని పేర్కొన్నారు. అండర్ - 17 జట్టుకు టీ.పూర్ణిమ, జే.దీక్షిత, ఏ.గౌరీ, ఎస్.వినయ్‌లు అండర్ - 14 జట్టుకు జి.చందు, పి.జయంతి ఎంపికైనట్లు ప్రధానోపాధ్యాయులు మోపాడ బంగారురాజు పేర్కొన్నారు. ఈనెల 23, 24, 25వ తేదీల్లో కాకినాడలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బంగారు రాజు, విద్యా కమిటీ చైర్మన్ టీ నాగమణి, బోని సంగమయ్య, కే.పైడన్న, కే.గౌరీ, కే.మురళి విద్యార్థులను అభినందించారు.

# రెవిన్యూ అధికారుల సమావేశంలో స్పష్టం చేసిన జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

## - రీ సర్వేలో తప్పులు లేకుండా చూడాలి - ప్రైవేటు దేవాలయాల్లో సి.సి కెమెరాలను ఏర్పాటు చేయాలి






**విజయనగరం, (రాజధాని వార్తలు):** రెవెన్యూ సేవల కోసం అందిన దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి తెలిపారు. ఇళ్ళ స్థలాలు, ఓ.బి.సి సర్టిఫికేట్, ఇంటిగ్రేటెడ్ సర్టిఫికెట్స్, మ్యుటేషన్ తదితర సేవల కోసం అందిన దరఖాస్తులు నిర్దేశిత గడువు దాటకుండా పరిష్కారం కావాలన్నారు. రెవిన్యూ అధికారులకు ఇది బేసిక్ విధియని, దీనిని నిర్లక్ష్యం చేయకూడదని హితవు పలికారు. ఆర్.డి.ఓ లు డైలీ దీనిపై తహసిల్దార్లతో సమీక్షించాలని సూచించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో రెవిన్యూ అధికారులతో సమీక్షించారు. మీ సేవ ఆన్లైన్ సర్వీసెస్, రీ సర్వే, ధాన్యం సేకరణ, రెవిన్యూ కలెక్షన్స్, హౌసింగ్, ఐ.వి.ఆర్.ఎస్ ఫీడ్ బ్యాక్, పిజిఆర్ఎస్, క్షేత్ర స్థాయి సందర్శనలు, ప్రభుత్వ భూముల అసైన్మెంట్, వేబ్లాండ్ మ్యుటేషన్స్, ఈ - పంట, రైస్ కార్డ్స్, దేవాదాయ భూములు, తదితర అంశాలపై సమీక్షించారు. మండల వారీగా పెండింగ్ ఉన్న వినతులపై ఆరా తీసారు. ఎందుకు గడువు దాటి ఉంటున్నాయని కారణాలను అడిగారు. ఇకపై డివిజన్ స్థాయిలోనే సమీక్షించడం జరుగుతుందని, పెండింగ్ ఉన్న వినతులపై బ్రేక్ అప్ కావాలని, మండల వారీగా ఎన్ని అందాయి, ఎన్ని పరిష్కారం అయ్యాయి, పెండింగ్ ఉన్నవాటికి కారణాలు సవివరంగా తెలియజేయవలసి ఉంటుందన్నారు. రీ సర్వేలో తప్పులు లేకుండా చేయాలనీ, క్షేత్ర స్థాయికి వెళ్లి ఆర్.డి.ఓలు కూడా పరిశీలించాలని తెలిపారు. తహసిల్దార్లు రీ సర్వేలో జాగ్రత్త వహించాలని, లేదంటే అనేక గొడవలకు తావిచ్చిన వారవుతారని అన్నారు. ప్రైవేటు దేవాలయాల్లో రోజులో కనీసం వెయ్యి మంది భక్తులు హాజరయ్యే దేవాలయాల వద్ద సి సి కెమెరాలను ఏర్పాటు చేయాలనీ, దేవాదాయ శాఖ, రెవిన్యూ అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. జే.సి సేదు మాధవన్ మాట్లాడుతూ ధాన్యం సేకరణ సక్రమంగా జరిగేలా ఆర్.డి.ఓ లు, తహసిల్దార్లు జాగ్రత్త వహించాలని తెలిపారు. జిల్లా స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందని, మండల స్థాయి, గ్రామా స్థాయి లో కూడా వెంటనే జరపాలని తెలిపారు. ఈ సమావేశంలో జే.సి సేదు మాధవన్, డి.ఆర్.ఓ శ్రీనివాస మూర్తి, ఆర్.డి.ఓ లు, కీర్తి, రాం మోహన్, సత్యవాణి , డిప్యూటీ కలెక్టర్లు, హౌసింగ్ పి.డి. మురళీ, జిల్లా వ్యవసాయాధికారి తారక రామా రావు, సర్వే ఏ.డి.లు, తహసిల్దార్లు, డి.టి లు, సర్వేయర్లు తదితరులు పాల్గొన్నారు.

# కార్తీక పౌర్ణమి నాడు అంధకారంలో అర్ధనారీశ్వరాలయం - ఈ పాపం ఎవరిది?



**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** శ్రీకాళహస్తి పట్టణ పరిధిలో ఉన్న అర్ధనారీశ్వర స్వామి ఆలయానికి విద్యుత్ సరఫరా చియ్యవరం గ్రామం నుండి ఇవ్వడంపై మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. 10000 లోడ్లు ఇసుక దోచుకొని కనీసం 10 లోడ్లు ఇసుకతో కూడా ఆలయానికి రోడ్డు వేయలేక పోయారన్నారు. కార్తీక పౌర్ణమి నాడు అర్ధనారీశ్వర స్వామి ఆలయానికి వచ్చే మహిళలు పడుతున్న ఇబ్బందులు చూస్తుంటే ఈ పాపం ఎవరిని విడిచిపెట్టదని హెచ్చరించారు. శివయ్య భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్న శ్రీకాళహస్తి దేవస్థానం ఈఓపై ఆగ్రహం వ్యక్తం చేశారు.శ్రీకాళహస్తి పట్టణం, కార్తీక పౌర్ణమి నాడు శ్రీ అర్ధనారీశ్వర స్వామివారి దర్శనానికి వెళ్లిన మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి అక్కడి పరిస్థితులు చూసి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. మహిళలు అధిక సంఖ్యలో వచ్చే కార్తీకమాసం నాడు స్వామివారి ఆలయంలో కనీసం విద్యుత్తు సరఫరా కూడా లేకపోవడం చాలా బాధాకరమన్నారు. అలాగే శ్రీకాళహస్తి పట్టణ పరిధిలో ఉన్న శివాలయానికి చియ్యవరం గ్రామ నుండి విద్యుత్ సరఫరా ఇవ్వడం, అందులో ఇవాళ విద్యుత్ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే స్వామి వారి ఆలయానికి వెళ్లే రోడ్డు సరిగ్గా లేక అక్కడికి వచ్చే మహిళలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటూ జారిపడటం చూస్తుంటే ఈ పాపంకి కారకులైన వారిని శివయ్య కఠినంగా శిక్షిస్తాడని అన్నారు. స్వామివారి ఆలయానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపులా పదివేల లోడ్లు ఇసుక దోచుకుని కనీసం 10 లోడ్లతో కూడా స్వామివారి ఆలయం రోడ్లు వేయాలనిపించలేదా అని ప్రశ్నించారు. శ్రీకాళహస్తి అనుబంధం ఆలయాలపై శ్రద్ధ లేని ఈవో దేవస్థానం ఏసి రూమ్‌లో కూర్చుని కలెక్షన్లకే పరిమితమయ్యారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శివయ్య భక్తుల మనోభావాలు దెబ్బతీస్తున్న దేవస్థానం ఈవో దీనిపై 24 గంటల్లో సమాధానం చెప్పాలని లేకుంటే ధర్నాకి దిగుతానని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం మాజీ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఉత్తరాజి సర్వణ కుమార్, కంట ఉదయ్ కుమార్, కొల్లూరు హరి నాయుడు, టైలర్ శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# నవంబర్ 7న జాబ్ మేళా నిర్వహణ : జిల్లా ఉపాధి కల్పన అధికారి కొండపల్లి శ్రీరామ్

**ఖమ్మం, (రాజధాని వార్తలు):** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం భారత్ హ్యుండాయ్ ప్రై. లిమిటెడ్, ఖమ్మం నందు సేల్స్ కన్సల్టెంట్స్(మేల్)- 22, సర్వీస్ అడ్వయిజర్- 2 ఉద్యోగాలు కల్పించుటకు నవంబర్ 7న శుక్రవారం ఉదయం 10.00 గంటల నుండి మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ., టేకులపల్లి) ఖమ్మం నందు జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కొండపల్లి శ్రీరామ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఖమ్మం, మధిర, సత్తుపల్లి, కొత్తగూడెంలలో పని చేసే విధంగా సేల్స్ కన్సల్టెంట్స్ (మేల్) పోస్టుకు ఏదేని డిగ్రీ, టూ వీలర్ డ్రైవింగ్ లైసెన్స్ గల 22 నుండి 30 వయస్సు కలిగిన యువకులు అర్హులని, ఎంపికైన వారికి వేతనం 18 వేల రూపాయలు ఉం టుందని అన్నారు. సర్వీస్ అడ్వయిజర్ ఉద్యోగాల ఖాళీలకు డీజిల్ మెకానిక్/ బిటెక్ మెకానిక్ అర్హత గల 22 నుండి 30 సంవత్సరాల వయస్సు గల యువతీ, యువకులు అర్హులని, ఎంపికైన వారికి వేతనం 12 వేల రూపాయలు ఉంటుందని తెలిపారు. మొత్తం 24 ఉద్యోగాల భర్తీకి గాను జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు, తమ విద్యార్హతల సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్ మేళాకు అర్హత గల యువతీ, యువకులు హాజరు కావాలని, ఇతర వివరాలకు 7036902902 నందు సంప్రదించాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఆ ప్రకటనలో పేర్కొన్నారు.


# హోమ్ స్టే గృహాలుగా మండువా లోగిళ్లు

**- పురాతన, సాంప్రదాయ, సాంస్కృతిక నిలయాలు మండువా లోగిళ్లు - పర్యాటక రంగంలో ఆకర్షణగా హోమ్ స్టే మండువా లోగిళ్లు**









**అల్లవరం, (రాజధాని వార్తలు):** హోమ్ స్టే విధానం పర్యాటక రంగంలో స్థానిక ప్రజల జీవన శైలిని, పురాతన నిర్మాణాలు, సాంప్రదాయాలు, ఆచారాలను, సంప్రదాయాలను, సాంస్కృతిక, సాంప్రదాయ వంటకాలను వారసత్వాన్ని పర్యాటకులు ప్రత్యక్షంగా అనుభవించే అవకాశం కల్పిస్తుందని జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు. బుధవారం అల్లవరం మండల పరిధిలో గూడాల గ్రామంలో పోలిశెట్టి సాయి మండవ ఇల్లు, ముక్తేశ్వరంలో వి దొరబాబుకు చెందిన, అయినవిల్లి కోనసీమ విల్లా రిసార్ట్స్ పురాతన మండువా లోగిళ్ళను ఆయన సందర్శించి హోమ్ స్టేట్ కొరకై అనువైన సనాతన వసతులు ఉన్నది లేనిది పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లా డుతూ హోమ్ స్టే విధానాన్ని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని ఆదిశగా జిల్లాలో ఉన్న పురాతన సాంస్కృతిక సాంప్రదాయాలను ప్రతిబింబించే మండువా లోగిళ్లను గుర్తించడం జరుగుతుందన్నారు. పర్యాటకులకు పూర్వపు సాంస్కృతిక, సంప్రదాయ అనుభూతి అందించేందుకు హోమ్ స్టేలు ప్రాముఖ్యత సంతరించుకున్నాయన్నారు. హోమ్ స్టే ద్వారా స్థానిక ఆదాయ వృద్ధికి అవకాశాలు మెరుగుపడతాయన్నారు. హోటళ్లకు ప్రత్యామ్నాయంగా హోమ్ స్టేలో తక్కువ ఖర్చుతో ఉంటూ ఆతిథ్యం హోమ్ స్టే బుకింగ్ కోసం ఆన్లైన్ ప్లాట్ ఫామ్‌లు, పర్యాటకులకు ప్రభుత్వం కల్పించనున్నదన్నారు. సాంస్కృతిక వారసత్వం పరిరక్షణలో హోమ్ స్టే విధానం ఉపకరిస్తుందన్నారు. వీటిలో పర్యాటకుల సంతృప్తి కోసం ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు, వంటకాలు ఆచారాలు తెలియడంతో పాటుగా భవిష్యత్తులో హోమ్ స్టే విస్తరణలో భాగంగా పర్యాటక రంగంలో పరిశ్రమ హోదా కలగనుందన్నారు. పర్యాటకులకు నేరుగా ఇంటి వాతావరణంలో సాంప్రదాయ అనుభవం, హోమ్ స్టే సేవలతో పర్యాటకులు పూర్వపు వారసత్వ, సంస్కృతి, సాంప్రదాయ అనుభూతిని పొందవచ్చునన్నారు. హోమ్ స్టేల ద్వారా పరిమిత బడ్జెట్‌లో పర్యాటకులు స్థానిక కుటుంబ భావాన్ని అనుభూతి చెందగలరన్నారు. ప్రాచీన సంప్రదాయాలు, ఆచారాలు, ఆహారాలు ఆస్వాదించవచ్చునన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పట్టణాలకు పక్కన గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న హోమ్ స్టేలను అభివృద్ధికి నాంది పలికిందన్నారు. ఈ విధానం పర్యాటకులకు వారి పర్యటనను మరింత సాంస్కృతికంగా, వ్యక్తిగత అనుభవంగా మార్చడానికి దోహదం చేస్తుందన్నారు. హోమ్ స్టే అన్నది పర్యాటకులకు వారి సొంత ఇంటిలో వున్న అనుభూతి కలిగించే వసతి అన్నారు. ఈ విధానం స్థానిక గ్రామీణ ప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి, పర్యాటక రంగంలో స్థానికులలో ఉపాధి అవకాశాల పెంపుకు సహకరిస్తుందన్నారు. పర్యాటకులకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన, సాంస్కృతిక అనుభూతులను కలిగించేలా మౌలిక సదుపాయాల ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. తద్వారా పర్యాటకులు ఒక ప్రాంతం యొక్క అసలైన జీవన విధానాన్ని అనుభవిస్తార న్నారు. సాంస్కృతిక మార్పిడినీ, స్థానిక కళలు, సంగీతం, నృత్యం, పండుగలు, భాషను దగ్గరగా తెలుసుకోవచ్చునన్నారు. స్థానిక ఆర్థిక అభివృద్ధికి హోమ్ స్టేలు గ్రామీణ ప్రాంతాల్లో స్థానిక ప్రజలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తాయన్నారు. సాధారణ హోటల్ బసకు భిన్నంగా, హోమ్ స్టేలు నిజమైన స్థానిక అనుభూతిని అంది స్తాయనడంలో ఎంత మాత్రం అతిశయోక్తి లేదన్నారు. సుస్థిర పర్యాటకం, ప్రకృతితో సఖ్యత కలిగిన, పర్యావరణానికి హాని లేని రీతిలో పర్యాటకులకు పూర్వపు సాంప్రదాయ సాంస్కృతిక వారసత్వపు అనుభూతిని అందించడంలో ఒక సమర్థమైన సాధనమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ కే మాధవి, జిల్లా పర్యాటక అధికారి అన్వర్, కిరణ్ స్థానిక సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దళిత ఆత్మగౌరవ మహాసభను విజయవంతం చేయండి

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందా కృష్ణ మాదిగ ఆదేశాల మేరకు సుప్రీంకోర్టు చీఫ్ జస్టిస్ గవాయ్‌పై జరిగిన సంఘటనపై నవంబర్ 17న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వర్ల దేవదాస్ మాదిగ పిలుపునిచ్చారు. దీంతో బుధవారం శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మార్పీఎస్ ఇంచార్జ్ ఇర్ల రాజా మాదిగ ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి నియోజక వర్గస్థాయి సమావేశం స్థానిక మునిసిపల్ ప్రాంగణంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా ఇన్చార్జ్ వర్ల దేవదాసు మాదిగ పాల్గొని మాట్లాడుతూ దళితుల ఆత్మగౌరవాన్ని నిలబెట్టుకునే లక్ష్యంకై, న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడుకునే ధ్యేయంకై, రాజ్యాంగాన్ని పరిరక్షించుకునే ఆశయ సాధనకై, సమరానికి సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. అలాగే నియోజకవర్గంలోని ప్రతి గ్రామం నుండి ప్రతి ఒక్క ఎమ్మార్పీస్ నాయకులు, కార్యకర్తలు తరలి రావాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ తిరుపతి జిల్లా కో ఇన్చార్జ్ మంగళపూరి సురేష్ మాదిగ, శ్రీకాళహస్తి నియోజవర్గం ఎమ్మార్పీఎస్ యువసేన అధ్యక్షులు మన్నేపల్లి ఈశ్వర్ మాదిగ, తొట్టంబేడు మండల అధ్యక్షులు కాపులూరి బాలు మాదిగ, శ్రీకాళహస్తి ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షులు పాలూరి వెంకట ముని మాదిగ, ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు గాదిపాకుల యతేష్ మాదిగ, బాలరాజు మాదిగ, గాదిపాకుల మోహన్ మాదిగ, జగదీష్ మాదిగ, ఎంఆర్పిఎస్ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.




## సర్కస్ ఆట కాదు - ఒక జీవితం : ఎమ్మెల్యే పంతం నానాజీ










**కాకినాడ రూరల్, (రాజధాని వార్తలు):** సర్కస్ అనేది మనం చూసేందుకు ఆటగా కనిపిం చినప్పటికీ, అది చాలామందికి జీవితాధారమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అన్నారు. బుధవారం సాయంత్రం కాకినాడ జేఎన్టీయూ సమీపంలోని గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన "బింగో సర్కస్" ప్రదర్శనను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నానాజీ మాట్లాడుతూ "సర్కస్ కళాకారులు ప్రాణాలను పణంగా పెట్టి ప్రజలకు వినోదం అందిస్తున్నారు. ఇది ఆట కాదు, ఒక జీవన విధానం. వారు చూపించే ప్రతీ ప్రదర్శనలో కష్టపాటు, నైపుణ్యం, ధైర్యం దాగి ఉందని తెలిపారు.

కాకినాడ నగర ప్రజలు సర్కస్ ప్రదర్శనను వీక్షించి కళాకారులను ప్రోత్సహించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో కాకినాడ సిటీ టీడీపీ అధ్యక్షుడు మల్లిపూడి వీరు, జనసేన నాయకులు ఆట్ల సత్యనారాయణ, చోడిశెట్టి శ్రీమన్నారాయణ, నిర్వాహకుడు వజీర్, బింగో సర్కస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## దారికి అడ్డంగా అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోవాలి



**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు మునిసిపాలిటీ పరిధిలోని హైస్కూల్ రోడ్డులో దారికి అడ్డంగా అక్రమ కట్టడాలు నిర్మిస్తున్నారని వెంటనే చర్యలు తీసుకోవాలని తూమాటి శ్రీనివాసరావు బుధవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మున్సిపల్ కార్యాలయ ఆవరణంలో స్థానిక విలేకరులతో మాట్లాడారు. గూడూరు పట్టణంలోని వార్డు నెంబరు 3, హైస్కూలు రోడ్డు డోర్ నెం.191-1లో 16 అంకణ ములు స్థలం, అలాగే మరో 145 అంకణములు స్థలమును రిజిష్టరు చేసికొని ఉన్నాను. అప్పటి నుండి నేను సదరు ఆస్తిని సర్వ సంపూర్ణ హక్కులతో అనుభవించుకొనుచున్నానన్నారు. ఆ ఆస్తికి పడమర వైపుగా ఉన్న రోడ్డులో దారి లేకుండా అడ్డంగా కొంత మంది కట్టడాలు నిర్మిస్తున్నారని. సదరు కట్టడముల వలన రాకపోకలు లేకుండా పోతుందని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. దీనికి స్పందించిన కమిషనర్ టౌన్ ప్లానింగ్ అధికారితో సర్వే చేయించి చర్యలు తీసుకుంటామన్నారు. దారికి అడ్డంగా నిర్మిస్తున్న కట్టడాలపై మున్సిపల్ అధికారులు ఎటువంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సిందే మరి.

## అన్నదానంతో పాటు రెండవ రోజు పేద మహిళలకు చీరల పంపిణీ

**- అన్నపూర్ణే! సదాపూర్ణే! శంకర ప్రాణ వల్లభే! జ్ఞానవైరాగ్య సిద్ధ్యర్థం భిక్షాం దేహీ చ పార్వతి - 1640 రోజులుగా దాతల సహకారంతో పేదలకు అన్నదాన కార్యక్రమాలు**





**వేములవాడ, (రాజధాని వార్తలు):** మై వేములవాడ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో దాతల సహకారంతో 1640 రోజులుగా నిర్వహిస్తున్న అన్నదాన కార్యక్రమంలో భాగంగా లక్ష్మీగణపతి కాంప్లెక్స్ వద్ద పేద మహిళలకు దాతలు అందించిన సహకారంతో చీరల పంపిణీతో పాటు అన్నదానం మరియు రాజన్న భీమేశ్వర ఆలయాల వద్ద పేదలకు అన్నార్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించడం జరిగిందని నేటి అన్న దాతలుగా డాక్టర్ జువ్వాడి వెంకటేశ్వర రావు స్నేహలత దంపతులు, ప్రతాప స్వప్న సంపత్ దంపతులు, గణాచారి మఠం శైలజ సాంబశివు దంపతులు, దేవ రాజు ఉమ బాలచందర్ రాజు దంపతులు, రామడుగు శ్రీలత, కొడుకులు కోడళ్లు: ప్రజ్ఞ శరత్చంద్ర దంపతులు, శిరీష సాయిచంద్ర దంపతులు, శర్వాణి రవిచంద్ర దంపతులు, హైదరాబాద్ వాస్తవ్యులు చిన్నారులు శ్రీహర్ష, సాయికృష్ణ ఉన్నారని, ఒక్కపూట పేదలకు భోజనం అందించడానికి సహకారం అందించే దాతలు ట్రస్టు సభ్యులను గాని 9246939388 నంబరుకు సంప్రదించాలని ట్రస్టు నిర్వాహకులు మధు మహేష్ కోరారు.

ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు మధు మహేష్ వొడ్యాల వేణు పాత సంతోష్ పొలాస రాజేందర్ పసుల శ్రీధర్ సగ్గు రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

## బొజ్జల బృందమ్మచే బాధితుల ఇంటి వద్దకే ముఖ్యమంత్రి సహాయ నిధి

**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి మాతృమూర్తి బొజ్జల బృందమ్మచే బాధితుల ఇంటి వద్దకే వెళ్లి ముఖ్యమంత్రి సహాయనిధిని బుధవారం అందజేశారు. శ్రీకాళ హస్తి పట్టణంలోని బాధితుల ఇళ్ల వద్దకు ఆమె వెళ్లి ముఖ్యమంత్రి సహాయ నిధిని అందజేశారు. ఈ సందర్భంగా బృందమ్మ మాట్లాడుతూ పట్టణంలో కొంతమందికి ఆరోగ్యం సరిగా లేక క్షీణించిందని, వారికి సహాయం చేయాలని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల వెంకట సుధీర్ రెడ్డికి విన్నవించుకోగా ఎమ్మెల్యే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుని కలిసి సిఎం సహాయ నిధి వారికి అందించి ఆదుకోవాలని కోరారన్నారు. ముఖ్యమంత్రి ఎమ్మెల్యే విన్నపాన్ని గుర్తించి ముఖ్యమంత్రి సహాయ నిధిని విడుదల చేయడం జరిగిందన్నారు. సి ఎం సహాయ నిధిని వారి ఇళ్ల వద్దకే వెళ్లి అందించి వారి యోగక్షేమాలు తెలుసుకోవడం జరుగుతుందని తెలియజేశారు. రాష్ట్రంలో ఎన్నో ఇబ్బందులు ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి పేదవారికి ఈ రూపంలో సహాయం చేయడం చాలా సంతోషకరమని తెలిపారు. పట్టణంలోని బి.మల్లేశ్వరికి 27941, ఏ.పరమేశ్వరికి 25000, ఎస్.నరేష్‌కి 84928, ఏ.రాంప్రసాద్‌కు 176499, ఎల్.గోపాల్‌కు 20524, బి.బుజ్జమ్మకు 90, 728, పి.నీరజకు 35914 రూపాయలు మొత్తం కలిసి 461534 రూపాయలను ఇవ్వడం జరిగిందని తెలియజేశారు. అలాగే తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఈ సంవత్సర కాలంలో శ్రీకాళహస్తి నియోజకవర్గం నందు 241 మంది బాధితులకు 2,62,60,033 రూపాయలు అందించామని, అలాగే మహిళలకు ఎన్నో మంచి కార్యక్రమాలు ముఖ్యమంత్రి చేస్తున్నారని, ఆంధ్ర రాష్ట్రంలో ప్రజలందరూ సంతోషంగా ఉన్నారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ టిడిపి అధ్యక్షులు విజయ్ కుమార్, మూడో వార్డు గోవిందు, మూడో వార్డు శివ బ్యాంకు కరీం, షఫీ, వెంకటేష్ చౌదరి, అస్మత్, రామచంద్రయ్య, కరీం, జహీర్ అహ్మద్, దారా పాండు, కేవీ ప్రతాప్, నాగరాజు, నెమళ్ళూరు సుబ్రహ్మణ్యం, టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# RAJADHANI CLASSIFIEDS Ad. Call
## 9440662699, rajadhanivartalu.com

### EDUCATIONAL

- కల్లం ఇంజనీరింగ్ కాలేజీ, గుంటూరు, 0863-2119726
- యస్ ఆర్ ఐ అకాడమీ ఆఫ్ సైన్సెస్ అండ్ హాస్పిటల్, మంగళగిరి 08645-230101
- ఎయిమ్స్ హాస్పిటల్, మంగళగిరి 9493065718
- యస్ ఆర్ యమ్ యూనివర్శిటీ, ఏపీ నీరుకొండ, 0863-2429299
- విట్ యూనివర్సిటీ, ఏపీ, ఐనవోలు, 0863-2370444
- IVY Overseas, Vijayawada 73375 55680
- VIVA School, Nambur 0866 668 8999
- , అరవింద స్కూల్ వేర్ ఈచ్ చైల్డ్ ఈజ్ స్పెషల్, మంగళగిరి 08645-246878
- Eurekha Child, An AID India Initiative, Chennai 89398 20480
- Adarsha Educational Society Visakhapatnam, 0891-287 4605
- SPRITS Colleges, Kadapa, 9848664650
- Centuriaon University Rollavaka, AP 9840015963

### HOSPITALS

- అష్రఫ్ మెటర్నిటీఇ అండ్ టి మల్టీ స్పెషాలిటీ హాస్పటల్, విజయవాడ డా.యం.ఎ. రెహమాన్, 0866-2475087
- చింతలూరు ఆయుర్వేదం డాక్టర్ డి.విశ్వనాథ్, 9032990138
- హాసిని మల్టీ స్పెషాలిటీ హాస్పటల్ మందడం, డా. రహీమ్ బాషా 87902 27564
- శాస్త్రి బామ్ ఆయుర్, మంగళగిరి, 7999959999
- Manipal Hospitals, Vijayawada, 0866-2469700
- Sri Sivanath Ayurvedic Clinic Vijayawada, 09440 162256
- Rushad Opticals,Mangalagiri 99667 87654

### MATRIMONIAL

- కావ్యశ్రీ మ్యారేజ్ లింక్స్: 1వ, 2వ,లేట్ మ్యారేజెస్, తోడు,సంబధాలు, డైవోర్సీస్, విడోస్, డోయర్స్,పెన్షనర్లకు,అన్ని కులాల వారికీ పోస్ట్ సెటిల్మెంట్లు(స్త్రీలకు ఫ్రీ రిజిస్ట్రేషన్) ఫోన్: 9100669324
- జానీ మ్యారేజ్ లింక్స్, విజయవాడ 985394613
- Post your Alliances ad on Rajadhani Vartalu NewsPaper
- Post your Alliances ad on rajadhanivartalu.com

### REAL ESTATE

- New Sneha Builders & Developers, Kurnool, AP 9440662699
- గాలిసా రియల్ ఎస్టేట్, అమరావతి 9440662699
- Apartments for Sale, Attractive Price,Crystal Constructions, Gated Community, NRI Hospital Road, Srinivasam Apartments, Mangalagiri, 9440662699
- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పరస్పర సహాయ సహకార గృహనిర్మాణ సంఘం, 0866-2452129
- ప్రైమ్ లివింగ్ రియల్ ఎస్టేట్ మంగళగిరి, 994860855

### NGO's

- శ్రీ శారదా పీఠం, విశాఖపట్నం 0891-2763332
- జ్ఞానందం, ఐనవోలు చర్చ్ 8790878542
- ఇమ్మానుయేల్ చర్చ్, ఐనవోలు 9866777439
- Christian Rights Protection Service of India, Vijayawada 79897 88645
- రామయ్య చారిటబుల్ ట్రస్ట్ ప్రెసిడెంట్ టి.రమేష్, మంగళగిరి 0863-999999

### RESTAURENTS

- New Continental Park Hotel Vijayawada, 0866-6679999
- అయ్యూబ్ బిర్యానీ హౌస్, ఇబ్రహీంపట్నం 9502727306
- Hotel Ilapuram, Vijayawada 0866-2575251
- Lemontree Premier, Vijayawada, 0866-6919999
- Bismilla Biryani Point Tadepalli, 6300096288
- Khaleel Bhai Family, Restaurent, Guntur 855087555
- Novotel,Vijayawada 0866-6688999
- నాని స్వీట్స్, మంగళగిరి 8374220220, 9989229799
- Lakshmi Mourya Malkapuram, 9052631122
- Seweet Magic, Mangalagiri 9059323334
- Hello Idly, Mangalagiri 95424 93333
- Chill Out Restaurent Undavalli, 8179549922
- Hotel Park Residency Vijayawada-81216 69996

### COMPANIES

- ఈ-కామర్స్ కన్సల్టింగ్ నవీన్, 9008640610
- Insurence needs for NRI's Call 6305479394
- Hareesh Video Shooting 9666643567
- S RICE Traders Vijayawada 9849741984
- రవికాంత్, ఐటీ కన్సల్టింగ్ 9908188454
- ఎప్ట్రానిక్స్ స్మార్ట్ సొల్యూషన్స్, మంగళగిరి 0866-2466675
- ఐవిస్ ఇ-సర్వీలియన్స్ కంపెనీ మంగళగిరి, 040-40038590
- నవీన్ ఈకామర్స్ కన్సల్టింగ్ 9008640610
- యూ యస్ ఎ స్మార్ట్ డీల్స్ గ్లోవ్స్ మాస్క్స్ 001-2489965595
- సిహెచ్.చంద్రశేఖర రెడ్డి, ది నూతక్కి ప్రాథమికవ్యవసాయ సహకార పరపతి సంఘం లిమిటెడ్, 08645-275239
- ఇన్కమ్ టాక్స్ ప్రాక్టీషనర్లు మంగళగిరి, 789998999
- Visakha Healthcare 92466 46561
- Vivanta, Vijayawada 0866 664 4444
- Minerva Grand 0866 667 8888
- Rain Tree Park, Nambur, ijmprop.com
- Echo Friendly Bags, Hyderabad-92461 69069
- ఏపీ యస్ యస్ డి సి హెల్ప్ లైన్ తాడేపల్లి, 8004252422
- Sri Venkateswara panbrokers, Guntur 0863-2228628
- మధు గ్రాఫిక్స్ డిజైనర్, హైదరాబాద్ 6303728907
- AICA Events, 9133133688
- శ్రీ దుర్గా డిజైనర్స్ లేడీస్ టైలర్స్ మంగళగిరి, 9959308664
- Madeena Trading Company Vijayawada, 9000628426
- పోట్లూరిత్తుని శ్రీకాంత్ లక్ష్మి సారీస్, మంగళగిరి 08645-234002
- డిజిటల్ ఎక్స్పోనెంట్స్, కిషోర్ digitalexponents.in 7793903754
- చైతన్య జి.జి బ్యాంక్, రాయపూడి గుంటూరు జిల్లా, 08645-244266
- ఏపీ యస్ ఆర్ టి హెల్ప్ లైన్ తాడేపల్లి, 0863-2340678
- జవహర్ ఆటోనగర్ ఆటోమొబైల్ టెక్నికల్ అసోసియేషన్ 9394139239, 8143444459
- Capital Way Residency, Tadepalli, 9493523232
- Lemon Tree Hotel, Vijayawada, 866 691 9999
- For Classifieds ad, Call 9440662699
- Rajadhani Real Estate Plots,Amaravati, AP Buy / Sell 9440662699

RAJADHANIVARTALU.COM
9440662699


# శిల్ల శ్రీనివాసుకి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానం



**కాకినాడ, (రాజధాని వార్తలు):** జగన్నాథపురంలో మండల ఇన్చార్జి కొక్కిలిగడ్డ గంగరాజు ఆధ్వర్యంలో నిర్వహించిన భారతీయ జనతా పార్టీ మండల ప్రవాస యోజన కార్యక్రమంలో భాగంగా ముఖ్య అతిథిగా పైడా కృష్ణమోహన్ పాల్గొని మండల కమిటీ సభ్యులతో సమావేశమై పార్టీ స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. స్థానిక 25వ డివిజన్లో నూతనంగా పార్టీలోకి శిల్ల శ్రీనివాసుకి పార్టీకండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు వారితోపాటు 30 మంది నూతనంగా జాయిన్ అయ్యారు. పైడా కృష్ణమోహన్ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలని ప్రతి పోలింగ్ కేంద్రంలో 11మంది సభ్యులను నియమించాలని తద్వారా వచ్చే కార్పొరేషన్ ఎలక్షన్ లో బిజెపి చురుకైన పాత్ర పోషించాలని తెలియజేస్తూ భారతదేశంలో ఉన్న ప్రతి ఒక్కరు స్వదేశీ వస్తువుల్ని వాడాలని తద్వారా బలమైన భారత దేశం నిర్మాణం చేయాలని వికసిత భారత్ లక్ష్యంగా పనిచేయాలని తెలియజేశారు 25 డివిజన్లో డోర్ టు డోర్ వెళ్లి స్వదేశీ స్టిక్కర్లను ప్రతి ఇంటికి అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ కొక్కిలి గంగరాజు, విశ్వనాథపల్లి శ్రీనివాసరాజు, సంఘాన్ని సత్యం, సీనియర్ నాయకులు కె.వి.రాఘవులు, మేడా పరమేశ్వరరావు, వంకా మాలతి, బర్రె శ్రీను, ఆకుల ధర్మారావు కర్రీ శ్రీనివాస్, గున్నాడ వరప్రసాద్. బొడ్డు చంద్రశేఖర్ మల్లాడి ప్రసాద్ వంకా సత్య ప్రసాద్ అధిక సంఖ్యలో బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


# జిజిహెచ్ సెక్యూరిటీ గార్డ్స్ సమస్యలపై కాంట్రాక్టు సంస్థకు సిఐటియు ఆధ్వర్యంలో వినతి

**కాకినాడ, (రాజధాని వార్తలు):** కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్స్ సమస్యలపై సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం మధ్యాహ్నం కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ సంస్థ ఇంచార్జ్ శ్రీనివాస్ వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సిఐటియు నగర కోకన్వీనర్ పలివెల వీరబాబు మాట్లాడుతూ కార్తికేయ సెక్యూరిటీ సర్వీసెస్ లిమిటెడ్ సంస్థ జిజిహెచ్లో కాంట్రాక్ట్ ప్రారంభించిన అప్పటినుండి కార్మికుల సమస్యలు సంస్థ ప్రతినిధులకు తెలియజేయడం జరిగిందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా జీతాలు పెంచాలని, గత చాలా కాలంగా అమలవుతున్న క్యాజువల్ లీవులు అమలు చేయాలని కోరుతు న్నామన్నారు. కార్మికుల డిమాండ్స్‌పై సంస్థ ప్రతినిధులు కార్మికు లతో చర్చించి ఒప్పందం చేసుకోవాలన్నారు. అదేవిధంగా యూని ఫారం కుట్టుకూలీ కూడా ఇప్పించాలని కోరుతున్నా మన్నారు. దీనిపై శ్రీనివాస్ స్పందిస్తూ సంస్థ యాజమాన్యానికి తెలియచేస్తామని, త్వరలోనే కార్మికులతో చర్చించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర కన్వీనర్ మలక వెంకటరమణ, జిల్లా కమిటీ సభ్యుడు మేడిశెట్టి వెంకట రమణ, సిఐటియు సెక్యూరిటీ గార్డ్స్ యూనియన్ నాయకులు లంకే ధర్మ, ఎస్.సోమరాజు, కె. భాగ్యలక్ష్మి, కె.భాస్కరరావు, చెక్కా ధర్మారావు, కె.దేవి, సిహెచ్. సత్యవేణి, పి.దేవి, కామేష్ తదితరులు పాల్గొన్నారు.



# కార్తీక పౌర్ణమి వేళ..! - ఆకాశదీపం వెలిగించిన పాలక మండలి ఛైర్మన్ కొట్టే సాయి ప్రసాద్





**శ్రీకాళహస్తి, (రాజధాని వార్తలు):** ప్రముఖ శైవ క్షేత్రంగా విరాజల్లుతున్న శ్రీకాళహస్తి దేవస్థానంలో కార్తీక పౌర్ణమిని పురస్కరించుకొని ఆకాశ దీపాన్ని ఆలయ ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టే సాయి ప్రసాద్ వేదమంత్రాల నడుమ వెలిగించారు. ఈ సందర్భంగా మహిళ భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి కార్తీక దీపోత్సవంలో పాల్గొన్నారు. అలాగే శ్రీకాళహస్తి పరిసర ప్రాంతాల్లో ఉన్న శివాలయాలు వద్ద దీపాలు వెలిగించి మొక్కలు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు దండి రాఘవయ్య, ఆలయ అధికారులు, సిబ్బంది, అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొన్నారు.

# స్మశాన వాటికలో సమస్యలను పరిష్కరించండి : ఎమ్మెల్యేను కోరిన చిన్న వైయస్సార్

**గూడూరు, (రాజధాని వార్తలు):** గూడూరు రూరల్ పరిధిలోని చెన్నూరు గ్రామంలో 2, 3వ హరిజనవాడలు రామలింగయ్య కాలనీ, జగనన్న కాలనీ, ఎస్టీ కాలనీ వాసులు స్మశాన వాటిలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని పరిష్కరించేందుకు చొరవ చూపాలని చెన్నూరుకు చెందిన టిడిపి నాయకులు ఎల్లసిరి శ్రీనివా సులు రెడ్డి (చిన్న వైయస్సార్)కి కాలనీ వాసులువిజ్ఞప్తి చేశారు. అందుకు స్పందించిన చిన్న వైయస్సార్ కాలనీవాసుల స్మశాన సంబంధించిన సమస్యలను గూడూరు శాసనసభ్యులు డాక్టర్ పాశిం సునీల్ కుమార్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తారని హామీ ఇచ్చారు. ఈ క్రమంలో బుధవారం చెన్నూరులో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసిన ఎమ్మెల్యే సునీల్ కుమార్‌కు గ్రామస్తుల అందరితో కలిసి స్మశాన సమస్యను చిన్న వైయస్సార్ వివరించారు. అందుకు స్పందించిన ఎమ్మెల్యే సునీల్ కుమార్ వెంటనేబిఫ్యాక్టరీ యాజమాన్యాల వారితో మాట్లాడి స్మశానంలోకి నీరు రాకుండా చూడాలని, ఫ్యాక్టరీ పక్కనే కాలువ తీసి, చెట్లను తొలగించి త్వరగా సమస్యను పరిష్కరించమని ఎమ్మెల్యే సునీల్ కుమార్ ఆదేశించారు. తమ స్మశాన సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లిన చిన్న వైఎస్ఆర్‌కి కాలనీవాసులు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎల్లసిరి శ్రీధర్ రెడ్డి, మాజీ సర్పంచ్ శివకుమార్, బిజెపి నాయకుడు అభిలాష్ రెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, గ్రామస్తులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.



Printed & Published by Pattan Hussain Khan, on behalf of M/S Vastitude Media Pvt.Ltd; Printed at Jagathi Publications Ltd., Sakshi Press, Survey No. 766/2 Ankireddy Palem Village, Guntur Rural, Dist. Guntur-522005, AP; Published at 6-45/1, Thullur Mandal, Guntur Dt,AP-522237; RNI NO: APTEL/2019/77985, Whatsapp: 9440662699,Email: rajadhanivartalu@gmail.com | Web: rajadhanivartalu.com | Founding Editor: Pattan Hussain Khan